


ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ లక్ష్యం. చంద్రబాబు నాయకత్వంపై పెట్టుబడిదారుల్లో విశ్వాసం ఉంది. గూగుల్, రిలయన్స్, మిట్టల్ వంటి సంస్థలు రాష్ట్రం వైపు చూస్తుండగా, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 02.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 41 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00






# నేటి వరకు రూ.66 వేల కోట్లు పెన్షన్ల పంపిణీ

- సంక్షేమంలో ప్రజా ప్రభుత్వానికి సాటి లేదు
- కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు
- నంద్యాలలో వైఎస్ విగ్రహం ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే
- విద్వేషాలు రగిల్చేలా వైసీపీ వివాదాలు సృష్టిస్తోంది
- పీఎం సేతు ద్వారా ఏపీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- విశాఖ రైల్వే జోన్ తో రాష్ట్ర ప్రజల కల సాకారం
- తుని పేదల సేవలో కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



**తుని (జర్నలిస్ట్ ఫైల్) :**కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకం కలిగిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా వైసీపీ కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడుతోందని సీఎం అన్నారు. ఈ అంశాన్ని ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన కొన్ని ఘటనల్ని ప్రస్తావిస్తూ వైసీపీ నేతల డ్రామాలను ఎండగట్టారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజా వేదిక సభకు హాజరై ప్రసంగించిన సీఎం వైసీపీ చేస్తున్న కుట్రలను ప్రజల ముందు ఉంచారు. ఆ పార్టీ నేతలు ఫ్రస్ట్రేషన్ తో ప్రతీ అంశాన్నీ వివాదం చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రీ పగలు శ్రమిస్తున్నాం. వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగిస్తోంది. సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు కుతంత్రాలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని హత్యచేసి తొలుత గుండెపోటు అన్నారు. గొడ్డలితో నరికి చంపి డ్రామాలు ఆడారు. ఒక్క ఛాన్స్ అని మోసం చేసి కోడికత్తి, గులకరాయి నాటకాలు వేశారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనల్ని ప్రజలు తెలుసుకోవాలి. పాలన వైకుంఠపాళి కాకూడదన్నదే మా విజ్ఞప్తి. గత పాలకులు ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే 241 కోర్టు కేసులు పరిష్కరించాకే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. గతంలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఎగ్గొట్టారు. మేం వచ్చాకే జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. అత్యంత పటిష్టంగా టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాం. కంప్యూటర్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియ జరిగింది.

మిగతా 2లో...

## చంద్రబాబు విజన్

# మోదీ సహకారంతో ప్రపంచ పటంలో ఆంధ్రప్రదేశ్





- సమర్థ నాయకత్వం, స్పీడ్ ఏపీని ప్రపంచపటంలో నిలబెట్టాయి
- గూగుల్ ఎంత ముఖ్యమో.. ఎస్ఎంఈ కంపెనీలు కూడా అంతే ముఖ్యం
- రాష్ట్రంలో మూడు ఎకనామిక్ రీజియన్స్ ను అభివృద్ధి చేస్తున్నాం
- డేటా సెంటర్ల పట్ల ఉన్న భయాలను పోగొట్టాల్సిన అవసరం ఉంది
- ప్రపంచస్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతాం
- ముంబైలో బ్యాంక్ ఆఫ్ అమెరికా కాన్ఫరెన్స్ లో మంత్రి లోకేష్

**ముంబై (జర్నలిస్ట్ ఫైల్) :** సమర్థ నాయకత్వం, స్పీడ్ ఏపీని ప్రపంచపటంలో నిలబెట్టాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ముంబయిలో 'అభివృద్ధికి కొత్త సరిహద్దులు పేరుతో బ్యాంక్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 ఇండియా కాన్ఫరెన్స్ లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతదేశాన్ని భవిష్యత్ కు సిద్ధం చేయడం - ఆంధ్రప్రదేశ్ అనుభవం అనే థీమ్ పై నిర్వహించిన ఫైర్ సైడ్ చాట్ లో మంత్రి లోకేష్ పలు ప్రశ్నలకు

మిగతా 2లో...

# పన్ను ఎగవేతపై పవన్ కొరడా

- సామాన్యులే పంచాయతీలకు పన్నులు కడుతున్నప్పుడు.. సంస్థలు ఎగవేస్తే ఎలా?
- ఉద్దేశపూర్వకంగా పంచాయతీలకు పన్ను ఎగవేతల్ని ఉపేక్షించం
- పన్ను ఎగవేతల కారణంగా రాష్ట్ర ఆర్థిక మూలాలు దెబ్బతింటున్నాయి
- పన్నులు సక్రమంగా చెల్లించి పంచాయతీల ఆర్థిక స్వావలంబనకు సహకరించాలి
- పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న సంస్థలపై సమగ్ర అధ్యయనానికి డీపీఓలతో ఎంపవర్డ్ కమిటీ
- పరిశ్రమలు, విద్యాసంస్థలు చెల్లిస్తున్న పన్నులపై రీ అసెస్మెంట్ నిర్వహించాలి
- పన్నులు సరిగా వసూలు చేస్తే పంచాయతీల్లో సమస్యలు ఉండవు
- పంచాయతీల పరిధిలో పరిశ్రమలు, విద్యాసంస్థల పన్నుల ఎగవేతపై నిర్వహించిన కీలక సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'పంచాయతీలు ఇచ్చే మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు వినియోగించుకుంటున్న విద్యాసంస్థలు, పరిశ్రమలు పన్నులను బాధ్యతాయుతంగా చెల్లించాలి'ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పంచాయతీల పరిధిలో ఉన్న పలు సంస్థలు ఉద్దేశపూర్వక పన్ను ఎగవేత చర్యలకు పాల్పడుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు పన్నుల చెల్లింపు వ్యవహారంలో పారదర్శకత పాటిస్తే పంచాయతీలకు ఆర్థిక స్వావలంబన

● వివరాలు 3 లో

# 24 రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :**దేశంలో 24 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో నాలుగేసి స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరగనుండగా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మూడేసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

మిగతా 2లో...

# సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త న్యాయమూర్తులు





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :**దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీలను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులతో పాటు..

మిగతా 2లో...

# కోటి మందితో యోగా వేడుకలు



- జూన్ 7 నుంచి రెండు వారాల పాటు నిర్వాహణకు భారీ ఏర్పాట్లు
- కోటి మందిని భాగస్వాములను చేసేలా చర్యలు
- జూన్ 21న అమరావతిలో కృష్ణా నది వంతెన (వెస్ట్ బైపాస్)పై రాష్ట్ర స్థాయి కార్యక్రమం
- సీఎం చంద్రబాబు పాల్గొనే ఈ కార్యక్రమానికి 25 వేల మంది హాజరు
- ఏపీ యోగా ప్రచార పరిషత్ ఏర్పాటుకు సీఎం ఆమోదం
- త్వరలో ఆర్థిక శాఖ నుంచి ఉత్తర్వులు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :**అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను రాష్ట్రంలో 'యోగాంధ్ర-2026' పేరుతో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' అనే విశిష్ట నినాదంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) వేడుకల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుపుతున్నామని తెలిపారు.

యోగాను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది రైతులు, మహిళా స్వయం సహాయక బృందాలు, మత్స్యకారులు, గిరిజనులు, వివిధ సాంస్కృతిక కళాకారులు, యువజన సంఘాల సభ్యులు, ఆటో-లారీ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులను యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామన్నారు.

మిగతా 3లో...

# కల్లుగీత కార్మికుడి కన్నీటి కథ విన్న సీఎం.. సొంతిల్లు నిర్మించాలని ఆదేశం



**తుని(జర్నలిస్ట్ ఫైల్) :** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించి, కల్లుగీత కార్మికుడు సింహాచలం నివాసానికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పథకం కింద రూ. 4 వేల పింఛన్‌ను స్వయంగా అందజేశారు. ఇంటికే సకాలంలో పింఛన్ అందుతోందా? సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు కలిగిస్తున్నారా? అని ఆరా తీశారు. పింఛన్ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేవని సింహాచలం ముఖ్యమంత్రికి తెలిపారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ కల్లు గీయడం ద్వారా నెలకు రూ. 5 నుంచి 6 వేల వరకు ఆదాయం వస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌తో కుటుంబ పోషణకు తోడ్పాటు లభిస్తోందని చెప్పారు. అయితే తనకు సొంత ఇల్లు లేదని, తాగునీటి ట్యాప్ కనెక్షన్ కూడా లేదని ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు సింహాచలానికి ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు ట్యాప్ కనెక్షన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యులకు ఉపాధి లేదా ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు.

మిగతా 2లో...



# కమర్షియల్‌కు మళ్లీ రెక్కలు

- మరోసారి పెరిగిన కమర్షియల్ సిలిండర్ ధరలు!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :**దేశంలో మరోసారి కమర్షియల్ సిలిండర్లపై భారీగా ధరలు పెరిగాయి. దీంతో వ్యాపార వర్గాలపై గ్యాస్ భారం మరింత ఎక్కువ అవనుంది. జూన్ 1 నుండి దేశవ్యాప్తంగా 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలను చమురు మార్కెటింగ్ కంపెనీలు మరోసారి పెంచాయి. ఇది చిన్న పెంపే అయినప్పటికీ, గత కొన్ని నెలలుగా వరుసగా పెరుగుతున్న ధరల నేపథ్యంలో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న చిన్న ధాబాలు నడుపుకునే వ్యాపారస్తులకు ఇది అదనపు భారంగా మారింది. అయితే, గృహ అవసరాలకు ఉపయోగించే 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధరలలో ఎలాంటి మార్పు లేకపోవడం గృహిణులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. ఈ తాజా పెంపు తర్వాత దేశంలోని ప్రధాన నగరాల్లో 19 కిలోల కమర్షియల్ సిలిండర్ కొత్త ధరలు ఇలా ఉన్నాయి. దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో సిలిండర్ ధర రూ. 42 పెరగడంతో, ఇక్కడ కొత్త ధర రూ. 3,113.50 కి చేరింది. ఇక కోల్‌కతాలో గరిష్టంగా రూ. 53.50 పెరగడంతో, కొత్త ధర రూ. 3,255.50గా నమోదైంది. ముంబైలో సుమారు రూ. 3,024 దాటింది.

- 2లో...

## కమర్షియల్‌కు మళ్లీ రెక్కలు

(మొదటి పేజీ తరువాయి)

**వరుస పెంపునకు గల కారణాలు :** కమర్షియల్ గ్యాస్ ధరలు గత కొన్ని నెలలుగా నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మే నెలలో భారీగా రూ. 993 వరకు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో వస్తున్న హెచ్చుతగ్గులు, పశ్చిమ ఆసియా ప్రాంతంలో నెలకొన్న తీవ్ర భౌగోళిక ఉద్రిక్తతలు. అంతర్జాతీయసప్లై చైన్ లో తలెత్తుతున్న ఇబ్బందులే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా ఆర్థిక విశ్లేషకులు చెప్తున్నారు. ఈ నిరంతర పెంపు వల్ల రాబోయే రోజుల్లో హోటళ్లలో ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగే అవకాశం కనిపిస్తోంది.

## కల్లుగీత కార్మికుడి కన్నీటి కథ విన్న సీఎం.. సొంతిల్లు నిర్మించాలని ఆదేశం



(మొదటి పేజీ తరువాయి)

తనతో పాటు కల్లుగీత వృత్తిని కూడా ఆదుకోవాలని సింహాచలం కోరగా, కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. కల్లుగీత కార్మికులకు సబ్సిడీపై మద్యం దుకాణాల కేటాయింపు వంటి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అనంతరం కల్లు గీత విధానాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి తాటిచెట్టుపై నుంచి తీసిన తాజా కల్లును రుచి చూశారు. సింహాచలం మనవడిని అప్యాయంగా ముద్దాడిన సీఎం, కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా గడపడం స్థానికులను ఆకట్టుకుంది.

## 24 రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

జార్ఖండ్లో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ స్థానాలన్నింటినీ భర్తీ చేసేందుకు నామినేషన్లు కోరుతూ ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. జూన్ 8వ తేదీ వరకూ అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయాలని నోటిఫికేషన్లో పేర్కొంది. నామినేషన్ల స్క్రూటినీ జూన్ 9న చేపట్టనుంది. జూన్ 11వ తేదీ వరకూ అభ్యర్థులు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకునేందుకు గడువు ఇచ్చింది.

జూన్ 18న 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్.. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లను లెక్కించి తుది ఫలితాలను వెల్లడించనుంది. జూన్ 20వ తేదీ నాటికి రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది.

కాగా.. ఏపీలో పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్ ల పదవీకాలం ఈ నెల 26వ తేదీనాటికి ముగియనుంది. దీంతో ఈ నాలుగు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ నోటిఫికేషన్ ఇచ్చింది. వీరి స్థానాల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎవరెవరిని నిలబెడుతుందన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

## సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త న్యాయమూర్తులు

(మొదటి పేజీ తరువాయి)

ఒక సీనియర్ న్యాయవాదిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వివరాలను కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ ద్వారా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల గరిష్ట సంఖ్యను 34 నుండి 38కి పెంచింది. ఈ తాజా నియామకాలతో సుప్రీంకోర్టులో ప్రస్తుతం మొత్తం 37 మంది న్యాయమూర్తులు కొలువుదీరినట్లయింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం గత వారం చేసిన సిఫార్సుల మేరకు కేంద్రం ఈ నియామకాలు చేపట్టింది.

పంజాబ్ & హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్ నాగు, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ సచ్ దేవా, జమ్మూ కాశ్మీర్ ఉ లడఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ పల్లి, సీనియర్ అడ్వకేట్ వి. మోహన సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. వి. మోహన 2015లో సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్‌గా గుర్తింపు పొందారు. సాయుధ దళాలలో మహిళా అధికారులకు శాశ్వత కమిషన్, కర్ణాటక హిజాబ్ నిషేధం వంటి పలు సంచలన కేసుల్లో ఆమె వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు చరిత్రలో ఈమె 12వ మహిళా న్యాయమూర్తి కావడం విశేషం. జస్టిస్ బి.వి. నాగరత్నతో కలిపి ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్న ఇద్దరు మహిళా జడ్జీలలో ఈమె ఒకరు కానున్నారు. నేరుగా బార్ నుండి ఎంపిక కావడం వల్ల ఈమెకు దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ పదవీకాలం లభించనుంది.

## సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ గా బాధ్యతలు చేపట్టిన తేళ్ల కస్తూరి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సి. ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ గా తేళ్ల కస్తూరి సోమవారం స్థానిక మీడియా అకాడమీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పూర్వపు సెక్రెటరీ శ్రీ మణిరామ్ రిటైర్మెంట్ కారణంగా ప్రస్థుతం జోన్ 3 జాయింట్ డైరెక్టర్ గా పనిచేస్తోన్న తేళ్ల కస్తూరి కి 'సెక్రెటరీ' గా పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ సమాచార శాఖ డైరెక్టర్ ఉత్తరువులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆ ఉత్తరువుల ను అనుసరించి సి. ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ గా పూర్తి అదనపు బాధ్యతలు ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా అకాడమీ మేనేజర్ ఎం. భాస్కర నారాయణ అకాడమీలో అమలవుతోన్న పలు కార్యక్రమాలను సెక్రెటరీ తేళ్ల కస్తూరికి వివరించారు. ఈ సందర్భంగా పూర్వపు మీడియా అకాడమీ సెక్రెటరీ మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, పలువురు పాత్రికేయులు సెక్రెటరీ కస్తూరి బాయి ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# నేటి వరకు రూ.66 వేల కోట్లు పెన్షన్ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

40 వేల ప్రశ్నలు, 25 రకాల ప్రశ్నాపత్రాలతో ఎక్కడా అక్రమాలు జరగకుండా భర్తీ ప్రక్రియ నిర్వహించాం. ఫ్రస్టేషన్ లో ఉన్న వైసీపీ దీనిని కూడా వివాదం చేసి రాజకీయ లబ్ధి పొందాలని ఆలోచన చేసింది. సమాజంలో అశాంతిని రేపాలని ప్రయత్నాలు జరిగాయి. జాగ్రత్తగా ఉండబట్టే గట్టిగా సమాధానం ఇవ్వగలిగాం. పరామర్శలకు వెళ్తూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లోకి విసిరేసి పోయారు. కడపకు చెందిన ఓ పాస్టర్ ను పంపి హత్యాయత్నం అంటూ డ్రామాలు ఆడారు. దానిని మా పార్టీ పై నెట్టేందుకు ప్రయత్నించారు. పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ ప్రమాదంలో చనిపోతే దానిని కూడా మాకు అంటగట్టాలని ప్రయత్నాలు జరిగాయి. సీసీ కెమెరాల సాయంతో ఈ కుట్రలను బట్టబయలు చేయగలిగాం. తిరుమలలోని కౌస్తుభం గెస్ట్ హౌస్ దగ్గర సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లను పారేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నం చేశారు. సాక్షాత్తూ కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని అప్రతిష్ట పాల్జేసేందుకు ప్రయత్నం చేసిన వారిని ఏమనాలి. వారిది వేరే మతం కావొచ్చు. దానికి మేం తప్పు పట్టటం లేదు. కానీ కుట్రలతో హిందూ దేవాలయాలపై దాడులు, అపవిత్రం చేసే కుట్రలు సరికాదని హెచ్చరిస్తున్నాను. కడపలో పెద్ద దస్తగిరిని వైసీపీ వారే ఆస్తుల వివాదంలో హత్యచేసి టీడీపీ వారిపై నెట్టేందుకు ప్రయత్నం చేశారు. నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే. వైసీపీ వాళ్లే ధ్వంసం చేశారు కాబట్టే సాక్షి పత్రికలో ఆ వార్తే రాయలేదు. కాకినాడలోనే వైసీపీ ఎమ్మెల్సీ దళితుడైన డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేశారు. కానీ వైసీపీ ఆ ఎమ్మెల్సీకి సన్మానాలు చేసింది. రాజకీయ పార్టీగా ఈ తప్పిదాలు సరిచేసుకోకుండా ఎదురుదాడి చేస్తున్నారు. కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతున్నవారి ఆటలు సాగనీయం. "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

**రెండేళ్ల క్రితం విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి :** "విధ్వంసం నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా జూన్ 4 తేదీ చరిత్రలో నిలిచిపోతుంది. గత పాలన అంతా విధ్వంసకర పాలన, బహిరంగంగా నవ్వాలని అనుకున్నా ప్రజలంతా భయపడే పరిస్థితి. ప్రజలు వెళ్లి పోకుండా కందకాలు తవ్వి, ఫెన్సింగ్ లు వేసి మరీ సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. దానికి నిదర్శనం పింఛన్ల పెంపు. రూ.10 లక్షల కోట్ల అప్పులు, బకాయిలు ఉన్నా... పెన్షన్లు ఒకేసారి రూ.1,000 పెంచి రూ.4 వేలు



చేశాం. దివ్యాంగులకు రూ.6,000 చేశాం. హెల్త్ పెన్షన్లు రూ.10 వేలకు, రూ.15 వేలకు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో అందించాం. ఏడాదికి దాదాపు రూ.32 వేల కోట్లు ఈ ఒక్క పథకానికే ఖర్చు పెడుతున్నాం. దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో, ఇంత ఎక్కువ మందికి పింఛన్లు ఇవ్వడం లేదు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం ఉంటుంది తప్ప ప్రజలను కలిసి వారి కష్ట సుఖాలు తెలుసుకునే పరిస్థితి ఉండదు. అందుకే ప్రతీ నెలా 1 తేదీన ప్రజలను నేరుగా కలుసుకుని పెన్షన్లు అందిస్తున్నాం. రాష్ట్రంలో 62.34 లక్షల మందికి, రూ.2,729 కోట్లు పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తున్నాం. ఈనెల కొత్తగా మరో 5,606 మందికి రూ.2.24 కోట్లు స్పౌజ్ పెన్షన్ల కోసం మంజూరు చేశాం రాష్ట్రంలో చాలా మంది పేద కుటుంబాలకు 2-4 సంక్షేమ పథకాలు అందుతున్నాయి. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్ సేవలో, మత్స్యకారుల సేవలో ఇలా వేర్వేరు పథకాలు వస్తున్నాయి. ఈ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు పెంచాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కల్పించేలా చర్యలు చేపట్టాం. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు కూడా మన యువతకు వస్తాయి. మన రాష్ట్ర యువత ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా పరిశ్రమలు తెస్తున్నాం. కాకినాడ సమీపంలో గ్రీన్ అమ్మోనియో పరిశ్రమను రూ.80 వేల కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. తుని పక్కనే అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ ఓ స్టీల్ సిటీని ఏర్పాటు చేస్తోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరుతున్నాం. పీఎం సేతు కింద యువతకు స్కిల్ డెవలప్మెంట్ చేస్తున్నాం. ఏడాదికి 25 వేల మంది యువతకు శిక్షణను పీఎం సేతు కింద ఇస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ కేంద్ర సహకారంతో తిరిగి పునరుద్ధరించాం. అలాగే విశాఖ రైల్వే జోన్ కల కూడా సాకారమైంది." అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**ఆదర్శవంతమైన రాష్ట్రంగా ఏపీ :** "పేదలకు విద్య, వైద్యంలో అత్యంత నాణ్యమైన సేవలు అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్య కోసం పాఠశాలల్లో సంస్కరణలు తీసుకువచ్చాం. పాఠ్యాంశాలు మారుతున్నాయి. నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులు చేయకుండా యూనివర్సల్ హెల్త్ పాలసీ కూడా తీసుకువస్తున్నాం. సంజీవని పేరిట వ్యక్తిగత ఆరోగ్యం కోసం డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందించి పర్యవేక్షిస్తాం. మెరుగైన జీవితాన్ని ప్రజలకు అందించేలా ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో సంజీవని అమలు చేస్తాం. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేలా ప్రజా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది కూడా జూన్ లో యోగాంధ్ర కార్యక్రమాన్ని కూడా అమరావతిలో నిర్వహిస్తున్నాం. 14 రోజుల పాటు నిర్వహించే యోగాలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిస్తున్నాను. వ్యాయామం, యోగా, మెడిటేషన్ లాంటివి చేస్తే మన ఆరోగ్యాన్ని మనమే పరిరక్షించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ను ఆదర్శవంతమై రాష్ట్రంగా తీర్చిదిద్దేలా 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపొందించాం. ప్రజలకు అందించే ప్రతీ పౌర సేవా సక్రమంగా, నాణ్యంగా అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది. శ్రీకాకుళం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి వరకూ విశాఖ రీజియన్ గా పశ్చిమగోదావరి నుంచి ప్రకాశం వరకూ అమరావతి రీజియన్ గా తిరుపతి కేంద్రంగా రాయలసీమ రీజియన్ ను అభివృద్ధి చేస్తున్నాం. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం మనపై పడింది. ఈసారి ఎల్ నినో కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. దీనికి మనం అంతా సన్నద్ధం కావాలి. సమర్ధ నీటి నిర్వహణతో ముందుగానే కాలువలకు నీళ్లు ఇవ్వగలిగాం. 2027 గోదావరి పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది జూలై లోగా పోలవరం ఎడమ కాలువ పూర్తి చేసి విశాఖ వరకూ నీరు తీసుకెళ్తాం. మత్స్యకార మహిళలకు సీవీడ్ ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నాం. మన మత్స్యకారులకు రూ.240 కోట్లతో 200 మెకనైజ్డ్ బోట్లు సబ్సిడీపై అందిస్తాం. అమినాబాద్ ఫిషింగ్ హార్బర్ కోసం రూ.80 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తాం. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

కాకినాడ జిల్లాలో పౌరసేవలు సంతృప్తిగా అందించిన ప్రభుత్వ యంత్రాం గాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలని సీఎం సూచించారు. పేదల సేవలో కార్యక్రమంలో పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులు బంగారు కుటుంబాలతో సీఎం మాట్లాడారు. పేదరికం లేని సమాజాన్ని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని అన్నారు. బంగారు కుటుంబాల్లో విద్యాధికులుగా, ఆదాయం ఆర్జించే వ్యక్తులుగా మారాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం వివరించారు. అనంతరం సభావేదిక వద్ద తన అభిమాని అయిన దివ్యాంగ యువకుడిని ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించారు. అతని భుజంపై చేయి వేసి ఫోటో దిగారు. ప్రభుత్వం తరపున ఆ దివ్యాంగ యువకుడికి సహకారం అందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ను సీఎం ఆదేశించారు. ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ ఉద్యాన పంటల సాగు మైక్రో న్యూట్రియంట్స్ తో పాటు ప్రకృతి సేద్యం దిశగా కృషి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఇంఛార్జి మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే యనమల దివ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

# రూ.3.20 లక్షల విలువైన వీల్‌చైర్ల పంపిణీ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** నిరుపేదలు, దివ్యాంగులకు అండగా నిలిచే ఉద్దేశంతో 'ది పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్' (ఒంగోలు), 'చేతన గ్లోబల్ ఫౌండేషన్' సంయుక్త ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.3.20 లక్షల విలువైన 40 వీల్‌చైర్లను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ లబ్ధిదారులకు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అందజేశారు. ఇందులో జీజీహెచ్‌కు రోగుల వినియోగార్థం రూ.2.40 లక్షల విలువైన 30 వీల్‌చైర్లు, ఇతర దివ్యాంగులకు రూ.80 వేల విలువైన 10 వీల్‌చైర్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో సేవాభావంతో ముందుకు వచ్చి అవసరమైన వారికి సహాయం అందిస్తున్న దాతలను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి ప్రియతో పాటు రెండు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. గుంటూరు జీజీహెచ్ ఇంచార్జీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.వి సుందరాచారి మాట్లాడుతూ ఆసుపత్రికి పెద్ద ఎత్తున వీల్‌చైర్లను అందించడం ద్వారా రోగులకు ఎంతో ఉపయోగం కలుగుతుందని పేర్కొంటూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ వైద్యాధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

# చంద్రబాబు విజన్ - మోదీ సహకారంతో ప్రపంచ పటంలో ఆంధ్రప్రదేశ్

(మొదటి పేజీ తరువాయి)

సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా కంట్రీ ఎగ్జిక్యూటివ్, ఇండియా సీఈవో విక్రమ్ సాహు వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రగతికి మూడు కారణాలు ఉన్నాయి. మొదటిది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు. నగరాలను నిర్మించడంలో, ఎకోసిస్టమ్ లను అభివృద్ధి చేయడంలో ఆయనకు ఆయనే సాటి. ఇప్పుడు ఏపీలో మళ్లీ చేస్తున్నారు.

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చాలా ముఖ్యం:** రెండోది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. విశాఖకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ ను తీసుకువచ్చాం. ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్ట్ ను మేము కేవలం 17 నెలల్లోనే ప్రారంభించగలిగాం. ఇది గ్రీన్ స్టీల్ రంగంలో భారతదేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ పెట్టుబడులలో ఒకటి కాబోతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనేది మనల్ని ఇతర రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా నిలబెడుతుంది.

**ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది :** మూడోది ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి కృషితో పెట్టుబడులను విజయవంతంగా రాబడుతున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. భారతదేశానికి డేటా సెంటర్ పెట్టుబడులను తీసుకురావడానికి మేం పర్మినెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, దానికి సంబంధించిన పన్ను నిబంధనలను మార్చాల్సి వచ్చింది. కేంద్రం సహకరించింది. డేటా సెంటర్ వచ్చింది.

**ఏఐలో టాప్‌లో ఉండాలని :** ఏఐలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండాలని చంద్రబాబునాయుడు గారు లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6.5 గిగావాట్ల సామర్థ్యంతో మల్టీ గిగావాట్ డిజిటల్ హబ్ ను నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో మొదటి వరుసలో ఉన్నది గూగుల్. 13 నెలల్లోనే ఏపీకి గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. పాలసీ, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్, భూమిని గుర్తించడంలో అంతా కలిసి పనిచేశాం. స్థానిక ప్రజలను ఒప్పించడంతో వారూ సహకరించారు.

**డేటా సెంటర్ల ద్వారా అనుబంధ పరిశ్రమలు వస్తాయి :** డేటా సెంటర్ల ద్వారా ఆర్థిక వృద్ధితో పాటు ఉద్యోగ కల్పన జరుగుతుంది. విశాఖపట్నంలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఉండటం వల్ల పెద్ద ఎత్తున ఏఐ, ఐటీ ఎకోసిస్టమ్‌ను నిర్మించవచ్చు. పవర్ ఎలక్ట్రానిక్స్, ఎయిర్ కండిషనింగ్ అనుబంధ సంస్థలకు అవకాశాలు పెరుగుతాయి. అందుకే నేను గూగుల్, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న మరికొన్ని భాగస్వామ్య సంస్థలతో కలిసి ఈ పూర్తి ఎకోసిస్టమ్‌ను నిర్మించడానికి కృషిచేస్తున్నాను.

**ఎంఎస్ఎంఈలూ ముఖ్యం :** నేను అనుసరించే Speed, Simplification, Stability మా విజయానికి సూత్రాలు.



గూగుల్ వంటి పెద్ద సంస్థలు ఎంత ముఖ్యమో, ఎస్ఎంఈ కంపెనీలు కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే అవి క్షేత్రస్థాయిలో అధిక సంఖ్యలో ఉద్యోగాలను కల్పిస్తాయి. మా ఎస్ఎంఈ మంత్రి గారి నాయకత్వంలో మేం ఇప్పుడు డీమ్డ్ పర్మిషన్స్ విధానాన్ని పరిశీలిస్తున్నాం. దీని ద్వారా మీరు మీ వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు,

**అందరి సహకారంతో :** ఒక ప్రాజెక్టు కోసం భూమిని సేకరించేటప్పుడు ఆ ప్రాజెక్ట్ వల్ల వచ్చే ప్రయోజనాలు, అక్కడ నిర్మించబోయే ఎకోసిస్టమ్, భూ యజమానుల కుటుంబాలకు లభించే ఉద్యోగ అవకాశాల గురించి వివరించాలి. మూడోది భూమికి సరైన నష్టపరిహారం, పారదర్శకమైన నమూనా ఉండాలి. 1995 నుండి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దీనిని చేసి చూపించింది. కాబట్టి ప్రజలకు మాపై నమ్మకం ఉంది. నమ్మకం లేకపోతే విజయం సాధించలేం. ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్ట్ కోసం 3వేల ఎకరాలు, 660 కుటుంబాలు ఉన్నాయి. కానీ మేం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంతో వారు ఎటువంటి సమస్యలు లేకుండా భూములు ఇచ్చారు.

**డేటా సెంటర్లపై అపోహలు తొలగించాలి :** డేటా సెంటర్ల విషయానికి వస్తే.. రెండు భిన్నమైన తీవ్రమైన అభిప్రాయాలు ఉన్నాయి. డేటా సెంటర్లు మంచివని కొందరు, చెడ్డవని కొందరు అంటారు. కాబట్టి అవి మంచివి కావని నమ్మే వారితో మాట్లాడటం ముఖ్యం. ఉదాహరణకు, అమెరికాను చూసుకుంటే మన దేశంలో వన్ నేషన్ వన్ గ్రిడ్ ఉంది. అమెరికాలో అది లేదు. అమెరికా మనకు నమూనా కాదు. నీటి విషయానికి వస్తే.. ప్రతి సంవత్సరం గోదావరి నుండి దాదాపు 3 వేల టీఎంసిల నీరు సముద్రంలో కలుస్తోంది. ఇది వియత్నాం లేదా బ్రెజిల్ దేశాల మొత్తం నీటి వినియోగంతో సమానం. మేము నిర్మించాలనుకుంటున్న 6.5 గిగావాట్ల డేటా సెంటర్లకు కేవలం ఒక టీఎంసీ నీరు మాత్రమే అవసరం. ఒక గిగావాట్ థర్మల్ పవర్ ప్లాంట్.. ఒక గిగావాట్ డేటా సెంటర్ కంటే 7 రెట్లు ఎక్కువ నీటిని వినియోగిస్తుంది. కానీ ప్రతి ఒక్కరూ డేటా సెంటర్ గురించి మాట్లాడుతున్నారు తప్ప థర్మల్ ప్లాంట్ గురించి మాట్లాడటం లేదు. కాబట్టి యువతతో ఈ విషయాలను మాట్లాడటం.. వారి భయాలను తొలగించడం ముఖ్యం. ఆ డేటా సెంటర్లు వచ్చే ఆ ప్రాంత ఎంపీ గారు స్వయంగా యువతను కలిసి ఓపెన్ చాట్ చేస్తున్నారు. అవసరమైతే జోనింగ్ నిబంధనలను మరింత సవరించడానికి కూడా మేం సిద్ధంగా ఉన్నాం. భారతదేశానికి ఇది మరింత ముఖ్యం. ఎందుకంటే మనం ఐటీ విప్లవం ద్వారా ఎంతో లబ్ధి పొందాం. కొన్ని ఉద్యోగాలు మారతాయనే విషయంలో ఎలాంటి సందేహం లేదు.

**ఉద్యోగాలు కల్పించే యువతను తయారు చేస్తాం :** ఏఐని ఉపయోగిస్తూ నైపుణ్యాలను పెంచుకుని రీసెర్చ్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రెండోది మన కరిక్యులమ్ ను మార్చాల్సిన అవసరం ఉంది. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్ వంటి తదుపరి తరం సాంకేతికతలకు అనుగుణంగా మార్చాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి ఆ విజన్ ఉంది. అందుకే ఆయన నాకు అటు విద్య, ఇటు ఐటీ శాఖలు రెండింటినీ ఇచ్చి, వాటిని అనుసంధానించమన్నారు. కేవలం ఉద్యోగాలు వెతుక్కునే వారు మాత్రమే కాకుండా, ఉద్యోగాలు సృష్టించే యువతను తయారు చేయడమే మా లక్ష్యం.

**వేగంగా పనిచేసే రాష్ట్రాలకే కేంద్రం మద్దతు ఇస్తుంది :** విధానాల రూపకల్పన ఢిల్లీలో జరిగితే.. అమలు మాత్రం గల్లీల్లో జరుగుతుంది. అమలు అనేది రాష్ట్రాలు, ముఖ్యమంత్రులు, వారి బృందాల బాధ్యత. కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన విధానాలను రూపొందిస్తోంది. కానీ రాష్ట్రాలు వాటిని సొంతం చేసుకుని అమలు చేయాలి. కొన్ని రాష్ట్రాలు మిగతా వాటి కంటే బాగా చేస్తున్నాయి. ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ అయిన ఏఎంసీఏ ప్రాజెక్ట్ గురించి మాకు 2025 ఫిబ్రవరి, మార్చిలోనే తెలిసింది. నేను రక్షణ మంత్రి గారిని కలిసి లేఖ ఇచ్చాను. ఆ ప్రాజెక్ట్ గురించి మాకెలా తెలిసిందో చూసి ఆయన ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత మేం దానిని నిరంతరం ఫాలో అప్ చేశాము. ఒకసారి ఆయన సీఎం చంద్రబాబు గారికి ఫోన్ చేసి.. మేం సిద్ధంగా ఉన్నాము, ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందా అని అడిగారు. కేవలం 36 రోజుల్లో పుట్టపర్తిలో 600 ఎకరాల భూమిని సేకరించి, భారత ప్రభుత్వానికి ఉచితంగా అందించాం. కేంద్ర ప్రభుత్వం ఆశించే వేగం అది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఏదో ఒక రాష్ట్రానికే మద్దతు ఇస్తోందనే వార్తలు పూర్తిగా అవాస్తవం. వేగంగా పనిచేసే రాష్ట్రాలకే కేంద్రం మద్దతు ఇస్తుంది.

**20 లక్షల ఉద్యోగాల కల్పన మా లక్ష్యం :** మేము కేవలం పెట్టుబడుల గురించే కాదు, పాలసీలపై ఓపెన్ ఫీడ్‌బ్యాక్ కూడా ఇస్తాం. ఉద్యోగాలను సృష్టించే ఏ చట్టాన్నైనా మార్చడానికి, సంస్కరించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఉద్యోగాల కల్పనే ప్రజాప్రభుత్వ ఏకైక ప్రాధాన్యత. ఏఐ, రోబోటిక్స్, అడ్వాన్స్ డ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇప్పుడు నిజం. కానీ ఉద్యోగాలను సృష్టించే రంగాలు చాలా ఉన్నాయి. మా లక్ష్యం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలను సృష్టించడం. ఇదే గౌరవ ప్రధానమంత్రి గారి ప్రాధాన్యత కూడా.

**రాష్ట్రంలో మూడు ఎకనామిక్ రీజియన్స్ అభివృద్ధి :** ఆంధ్రప్రదేశ్ 22 క్లస్టర్లను నిర్మిస్తోంది. డేటా సెంటర్లు, ఫార్మా, మెడికల్ డివైసెస్, ఐటీ, కంప్రెస్డ్ బయో గ్యాస్, అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్, క్వాంటం కంప్యూటింగ్ నుంచి గ్లాస్ సిటీ, స్పేస్ సిటీ, డిఫెన్స్ సిటీ వరకు.. దాదాపు 150-200 కిలోమీటర్ల పరిధిలోనే పూర్తి తయారీ ఎకోసిస్టమ్ నిర్మించడమే మా లక్ష్యం. దీని ఉద్దేశం. ఒక టీవీని అసెంబుల్ చేయడమే కాకుండా, దానికి కావలసిన ప్లాస్టిక్ హౌసింగ్, థర్మాకోల్, మాన్యువల్స్ ప్రింట్ చేసే వారు కూడా అదే ఎకోసిస్టమ్‌లో భాగం కావాలి. ఇది మనం ఇతర దేశాల నుండి నేర్చుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌కు భారతదేశంలోనే రెండవ అతిపెద్ద తీరప్రాంతం ఉంది. ఇది పోర్టుల అభివృద్ధికి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు సమీపంలో ఉండటం వల్ల వాటి బలాన్ని ఉపయోగించుకుని కొత్త ఎకోసిస్టమ్‌లను నిర్మించడానికి సహాయపడుతుంది. గ్లాస్ సిటీ ఎందుకంటే ఆదాయం పెరిగే కొద్దీ గ్లాస్ వినియోగం పెరుగుతుంది. మన దగ్గర దానికి కావలసిన సిలికా లభిస్తుంది. స్పేస్ సిటీ ఎందుకంటే మనకు శ్రీహరికోట లాంచ్ ప్యాడ్ ఉంది. ఉత్తరాంధ్రలో ఫార్మా ఎకోసిస్టమ్ ఉంది. విశాఖలో స్టీల్ ప్లాంట్ ఉంది. కాబట్టి వాటిని మరింత రెట్టింపు చేస్తున్నాం. మేము కేవలం ఒకే నగరాన్ని కాకుండా, మూడు ఎకనామిక్ రీజియన్స్ ను అభివృద్ధి చేస్తున్నాం.

**ప్రపంచస్థాయి నగరంగా అమరావతి :** చంద్రబాబునాయుడు సైబరాబాద్‌ను నిర్మించారు. ఈసారి అమరావతిని నిర్మిస్తున్నారు. మొదటి దశలోనే రైతుల నుంచి 33 వేల ఎకరాల భూమిని సేకరించి పూర్తి గ్రీన్‌ఫీల్డ్ నగరాన్ని నిర్మిస్తున్నారు. విద్యాసంస్థలు, హాస్పిటాలిటీ, హాస్పిటల్స్, క్వాంటం కంప్యూటింగ్, లైఫ్ సైన్సెస్ అన్నీ ఈ కొత్త నగరంలోకి వస్తున్నాయి. భారతదేశంలో ఒక ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మించడానికి జరుగుతున్న సరికొత్త ప్రయత్నం ఇది. 2019లో ప్రభుత్వం మారడం వల్ల ప్రాజెక్ట్ కొంచెం నెమ్మదించింది. ఇప్పుడు పూర్తిస్థాయిలో పనులు జరుగుతున్నాయి. 2028 నాటికి ప్రభుత్వ కోర్ సిద్ధమై దేశానికి అంకితం చేయటం జరుగుతుంది. విట్, ఎస్ఆర్ఎమ్ ఇప్పటికే అక్కడ ఉన్నాయి. బిట్స్ తమ క్వాంటం క్యాంపస్‌ను అమరావతిలో నిర్మిస్తోంది. ఇది 18 నెలల్లో అందుబాటులోకి వస్తుంది. ఆ స్థాయిలో పనులు జరుగుతున్నాయి. రాష్ట్రాల మధ్య పోటీ ఉంటేనే దేశం గెలుస్తుంది. రాజకీయాల్లో కూడా అనేక అవకాశాలు ఉన్నాయి. మనం ఆశించిన మార్పు కోసం యువత, మేధావులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని మంత్రి చెప్పారు.

# విశాఖ రైల్వే జోన్ ప్రధాని మోదీ ఇచ్చిన చారిత్రక కానుక



- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన దక్షిణ తీర రైల్వే జోన్ (సౌత్ కోస్ట్ రైల్వే) విశాఖపట్నం కేంద్రంగా కార్యరూపం దాల్చడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన అత్యంత విలువైన కానుకల్లో విశాఖ రైల్వే జోన్ ఒకటని ఆయన అన్నారు.

బిజెపి జాతీయ సమాశాల నిమిత్తం ఢిల్లీ కి వచ్చి న మాధవ్ జాతీయ నాయకత్వాన్ని స్వయంగా కలసి విశాఖ రైల్వే జోన్ ఈరోజు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర విభజన అనంతరం ప్రజల్లో నెలకొన్న ప్రధాన డిమాండ్లలో రైల్వే జోన్ ఒకటని గుర్తుచేసిన మాధవ్, ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత ప్రధాని మోదీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడిన ఈ జోన్‌లో విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు ఉండడం ద్వారా పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు.

దేశంలోనే కీలక పోర్టు నగరంగా ఉన్న విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటు కావడం వల్ల పోర్ట్ కనెక్టివిటీ, పారిశ్రామిక సరుకు రవాణా, ఎగుమతి–దిగుమతి కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ, గంగవరం పోర్టు, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి కూడా ఇది బలమైన మద్దతుగా నిలుస్తుందని అన్నారు.

ఇప్పటివరకు ఇతర రైల్వే జోన్ల పరిధిలో ఉండటం వల్ల అనేక నిర్ణయాలు ఆలస్యమయ్యేవని, ఇప్పుడు స్థానిక అవసరాలకు అనుగుణంగా కొత్త రైళ్లు, రైల్వే ప్రాజెక్టులు, స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగే అవకాశం ఉందని మాధవ్ వివరించారు.

రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం, అనుబంధ విభాగాలు, నిర్వహణ కేంద్రాల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక, పరిపాలనా, కాంట్రాక్ట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి వంటి ప్రధాన రైల్వే స్టేషన్లలో ఆధునిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం లభించనుందని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. డిజిటల్ సేవలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రయాణికుల సౌకర్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందన్నారు.

దక్షిణ తీర రైల్వే జోన్ పరిధిలో కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్ పనులు, సరుకు రవాణా కారిడార్లు, హైస్పీడ్ కనెక్టివిటీ ప్రాజెక్టులు చేపట్టేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని మాధవ్ తెలిపారు. ఈ జోన్ ఉత్తరాంధ్రతో పాటు మొత్తం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలక ఇంజిన్‌గా మారనుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రాంతీయ అసమానతలను తగ్గించి, అభివృద్ధిని వికేంద్రీకరించే దిశగా విశాఖ రైల్వే జోన్ చారిత్రక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న పీవీఎన్ మాధవ్, రాష్ట్ర ప్రజల ఆకాంక్షను సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ అసత్య ప్రచారం తగదు



**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామకాల విషయంలో వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ మెగా డీఎస్సీ ద్వారా భారీ స్థాయిలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. ఈ ప్రక్రియను స్వాగతించాల్సిన ప్రతిపక్షం వైసీపీ రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని విమర్శించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఇప్పుడు మెగా డీఎస్సీపై విమర్శలు చేయడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా నియామక ప్రక్రియను నిర్వహించిందని అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకుందని తెలిపారు. నిరుద్యోగ యువత వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని వైసీపి చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని కానాల మల్లికార్జున రెడ్డి సూచించారు. రాష్ట్ర అభివృద్ధి యువత భవిష్యత్తు కోసం టీడీపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

## మోదీ సంకల్పంతో విశాఖ రైల్వే జోన్... రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'గేమ్ చేంజర్'



- **కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ**

**భీమవరం (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అత్యంత కీలకమైన విభజన హామీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సగర్వంగా నెరవేర్చిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. విశాఖపట్నం కేంద్రంగా దేశంలోనే 18వ రైల్వే జోన్‌గా "దక్షిణ కోస్తా రైల్వే జోన్" తన అధికారిక కార్యకలాపాలను ప్రారంభించడం ప్రతి ఒక్క ఆంధ్రుడికి గర్వకారణం అని ఆయన పేర్కొన్నారు. ఏపీ ప్రజల దశాబ్దాల నాటి సుదీర్ఘ నిరీక్షణకు మోదీ ప్రభుత్వ హయాంలోనే కార్యరూపం దాల్చిందని, రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఈ చారిత్రాత్మక నిర్ణయం కేవలం ఉత్తరాంధ్ర ప్రాంతానికే పరిమితం కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఒక 'గేమ్ చేంజర్' కానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ, రాష్ట్ర రైల్వే రంగ ముఖచిత్రాన్ని సరికొత్తగా మార్చేలా ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మంత్రి శ్రీనివాస వర్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ జోన్ ఏర్పాటును వేగవంతం చేసిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కి, బీజేపీ జాతీయ నాయకులు నితిన్ నబీన్ కి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున ఆయన తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ?కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం "డబుల్ ఇంజన్" వేగంతో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబుల్ ఇంజన్ కలయికతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని భారీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సాకారం కానున్నాయని ఆయన తన ప్రకటనలో స్పష్టం చేశారు. దాదాపు 3,532 కిలోమీటర్ల సుదీర్ఘ పరిధి, 4 డివిజన్లు, మొత్తం 385 రైల్వే స్టేషన్లతో విస్తరించిన ఈ నూతన జోన్ రాష్ట్ర రైల్వే రంగ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయడమే కాకుండా స్థానిక నిరుద్యోగ యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించనుందని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని 'వైజాగ్ డెక్' భవనంలో తాత్కాలికంగా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, అతి త్వరలోనే పూర్తిస్థాయి సదుపాయాలతో 12 అంతస్తుల అత్యాధునిక సొంత భవనం సిద్ధం కానుందని ఆయన వెల్లడించారు.

# పన్ను ఎగవేతపై పవన్ కొరడా



(మొదటి పేజీ తరువాయి)

దక్కుతుందని తెలిపారు. పన్ను ఎగవేతల కారణంగా రాష్ట్ర ఆర్థిక మూలాలు దెబ్బతింటున్నాయన్నారు. పంచాయతీల్లో ఎన్ని విద్యాసంస్థలు ఉన్నాయి? ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి? ఎంత వ్యర్థాలు ఉత్పత్తి చేస్తున్నాయి? ఎంత నీరు వాడుకుంటున్నాయి? ఏఏ సౌకర్యాలు వినియోగించుకుంటున్నాయి? ఎంత పన్ను చెల్లిస్తున్నాయి? అనే అంశాలపై అధ్యయనం జరిపేందుకు ఓ సాధికార కమిటీని ఏర్పాటు చేసి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

సోమవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీలకు పరిశ్రమలు, విద్యాసంస్థల పన్ను ఎగవేతపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల పంచాయతీ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న పరిశ్రమలు, విద్యా సంస్థలు, హ్యాచరీలు తదితర సంస్థల నుంచి పన్నుల వసూళ్లలో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ప్రయివేటు విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య పెరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కూడా పెద్ద ఎత్తున కడుతున్నారు. ఆ విద్యా సంస్థలు పంచాయతీల పరిధిలో ఉంటున్నాయి. పన్నులు సరిగా చెల్లించడం లేదు. విద్యాసంస్థలు, పరిశ్రమలు పంచాయతీలకు కడుతున్న పన్నులపై రీ అసెస్‌మెంట్ జరపాలి. నిర్మాణాల విలువ తగ్గించి చూపడం, ఉద్దేశపూర్వకంగా పన్నులు తక్కువ చూపడం చేస్తున్నారు. వేల మంది విద్యార్థులు ఉన్న విద్యాసంస్థలు సైతం పంచాయతీలు ఇచ్చే సౌకర్యాలు తీసుకుంటున్నాయి. పన్నులు మాత్రం కట్టడం లేదు.

ఒక ప్రభుత్వ ఉద్యోగి తనకు వచ్చే జీతంలో పన్ను కడుతున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి చేపల వేట మీద జీవనం సాగించే మత్స్యకారులు కూడా పన్నులు కడుతున్నారు. దిగువ మధ్య తరగతి వాళ్లు సైతం పన్నులు కడుతున్నప్పుడు విద్యాసంస్థలు, పరిశ్రమలు ఎందుకు సరిగా పన్నులు కట్టడం లేదు? పరిశ్రమలు, విద్యాసంస్థలు, హోటళ్లు ఎంత వ్యర్థాలు విడుదల చేస్తున్నాయి? ఎంత నీటిని వినియోగించుకుంటున్నాయి? పన్నులు చెల్లించేందుకు ఎందుకు ఇబ్బంది పడుతున్నాయి? ఎగవేతల వెనుక రాజకీయ ప్రమేయాలు ఏమైనా ఉన్నాయా? సబ్సిడీలు ఏమైనా ఇచ్చామా? అనే అంశాలపై నివేదికలు రూపొందించండి" అని ఆదేశించారు.

**ఉద్యోగులు- ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీగా పని చేయాలి :** ఆంధ్ర పేపర్ మిల్స్ లాంటి సంస్థలు కాలుష్యాన్ని గోదావరిలోకి వదిలేస్తూ, స్థానిక సంస్థలకు పన్నులు ఎగవేస్తున్నాయని అన్నారు. ఉద్యోగులు తమ పని తాము చేయాలని, ప్రజలకు, ప్రభుత్వానికే జవాబుదారీగా పని చేయాలని సూచించారు.

విద్యా సంస్థలు, హాస్టళ్లలో సగటున ఒక విద్యార్థి రోజుకు 35 లీటర్ల నీరు వినియోగిస్తే ఎంత గ్రే వాటర్ వస్తుంది? చెత్త ఎంత వస్తుంది? అందుకు తగిన విధంగా పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదాయాన్ని సృష్టించాలని చెబుతున్నారని, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ ఆదాయ వనరులు పెరగడం లేదన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**పంచాయతీలకు రూ.160 కోట్ల పన్ను బకాయిలు :** గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థల్లో ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు డబ్బులు లేవని చెబుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు రూ.88 కోట్ల అవసరం ఉందన్నారు. ఒక్క ఆంధ్ర పేపర్ మిల్ సంస్థే రూ.13 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు.

రాష్ట్రం మొత్తం మీద పరిశ్రమలు చెల్లించాల్సిన పన్ను బకాయిలు కనీసం రూ.115.57 కోట్లు ఉన్నాయని, విద్యాసంస్థల నుంచి రూ.45 కోట్లు రావాల్సి ఉందన్నారు. ఈ రూ.160 కోట్లలో సగం డబ్బు ఖర్చు చేస్తే రాష్ట్రంలోని ఫిల్టర్ బెడ్లన్నింటినీ బాగు చేయవచ్చని పేర్కొన్నారు.

పన్నులను సమర్థంగా వసూలు చేస్తే పంచాయతీలకు సుమారు రూ.5,496 కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు, సిబ్బంది జీతాల సమస్యలు, వీధి దీపాల సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయని అన్నారు.

**చెట్టినాడ్ సిమెంట్స్ పన్ను వసూళ్లలో అవకతవకలపై తక్షణ చర్యలు :** పంచాయతీలు బాగుపడాలంటే నాలుగు గ్రేడ్లకు వేర్వేరు స్లాబులతో పన్నులు నిర్ణయించాలని సూచించారు. విద్యాసంస్థలకు కూడా గ్రేడ్లు నిర్ణయించాలని చెప్పారు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ పన్నులు చెల్లించకుండా ఉండటం సరికాదన్నారు.

గత 30 ఏళ్లలో పంచాయతీల ఆస్తులు ఎంత మేరకు అన్యాక్రాంతం అయ్యాయనే అంశంపై కూడా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పన్ను చెల్లింపుల వ్యవహారంలో మినహాయింపులు అవసరమైతే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

తాళ్లపాలెం, చెట్టినాడ్ సిమెంట్స్ నుంచి పన్ను వసూలు చేయని పంచాయతీ కార్యదర్శిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, పన్ను వసూళ్లలో అవకతవకలను ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు.

**పంచాయతీల స్వయం సమృద్ధి ప్రణాళికలు :** పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు పెంచుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. అందుకోసం కలప ఇచ్చే మొక్కలను ప్రతి పంచాయతీలో 2 వేల చొప్పున నాటాలని చెప్పారు. దీనికోసం పంచాయతీరాజ్, అటవీ శాఖల మధ్య పరస్పర ఒప్పందం కుదిరిందన్నారు.

ఒక పంచాయతీ యూనిట్‌గా ఏ విధమైన ఆదాయ వనరులు ఉంటాయి? ఎన్ని రకాల ఆదాయాలు సమకూర్చవచ్చు? అనే అంశాలపై జిల్లా పంచాయతీ అధికారులతో కూడిన సాధికార కమిటీ అధ్యయనం చేయాలని ఆదేశించారు. బిల్ బోర్డులు, ఎంటర్‌టైన్‌మెంట్ టాక్సులతో పాటు పంచాయతీల ఆదాయం పెంచే అన్ని అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణ తేజ, అన్ని జిల్లాల డీపీఓలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కోటి మందితో యోగా వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

10 లక్షల మంది నిత్య సాధకులను తయారు చేస్తామని వెల్లడించారు. గతేడాది 1.5 లక్షల మంది శిక్షకుల ద్వారా కార్యక్రమాలు నిర్వహించామని, ఈసారి అదనంగా మరో లక్ష మంది శిక్షకులను జత చేస్తూ మొత్తం 2.5 లక్షల మంది శిక్షకులతో కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

ఈసారి కూడా యోగా, ప్రకృతి వైద్య ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో రూపొందించిన యోగా వీడియోలను ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు.

**నిరంతర పర్యవేక్షణ కోసం 'వార్ రూం' ఏర్పాటు :** యోగా దినోత్సవ వేడుకల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సెక్రటరీ సౌరభ్ గౌర్, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఆయుష్ డైరెక్టర్ జి. వీరపాండియన్, యోగా, ప్రకృతి వైద్య సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుతో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

యోగాసనాల ప్రాధాన్యతను తెలిపే విధంగా ప్రత్యేకంగా ఏపీ యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు కోసం పంపిన ప్రతిపాదనకు సీఎం ఆమోదముద్ర వేశారని, ఇందుకు సంబంధించిన ఫైలు ఆర్థిక శాఖ పరిశీలనలో ఉందని తెలిపారు. ఈ పరిషత్ ఏర్పాటుతో మూడు ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటవుతాయని చెప్పారు. యోగాసనాల కార్యక్రమాలకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగేలా ఈ పరిషత్ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు.

గత ఏడాది రికార్డు స్థాయిలో నిర్వహించిన యోగాసనాల కార్యక్రమాలకు రెండు గిన్నిస్ బుక్ రికార్డులు, 21 వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులు, ఒక స్కోచ్ అవార్డు లభించాయని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు జరిగే బోధనలో యోగాను అంతర్భాగంగా చేర్చారని, అందుకు ఉత్తర్వులు కూడా జారీ చేశారని చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే యోగాసనాల కార్యక్రమాల నిరంతర పర్యవేక్షణ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం కోసం మంగళగిరిలోని ఏపీఐఐసీలో ప్రత్యేకంగా 'వార్ రూం' ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

**ముఖ్యాంశాలు**

ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు (14 రోజులపాటు) యోగా ప్రచారం, జూన్ 21న ప్రధాన యోగా దినోత్సవ వేడుకలు అమరావతిలో, రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 28 ప్రత్యేక థీమ్‌లతో కార్యక్రమాలు, ప్రతి జిల్లాలో రెండు ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు, రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు నాలుగు పర్యాటక ప్రదేశాల్లో కార్యక్రమాలు, ఈ నెల 7న యోగా కార్యక్రమాల ప్రారంభోత్సవాన్ని సత్యసాయి జిల్లా లేపాక్షిలో నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.




**జిల్లాల వారీగా ప్రత్యేక థీమ్‌లు**

డాక్టర్ ఎన్టీఆర్ జిల్లా – పోలీసులు
కోనసీమ – రైతులు
కృష్ణా జిల్లా – ఆటో, లారీ అసోసియేషన్లు
తిరుపతి – సెలబ్రిటీలు
విశాఖపట్నం – మాజీ సైనికోద్యోగులు

**ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో యోగా**

**గుంటూరు** : ఉండవల్లి గుహలు, మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం
**నంద్యాల** : శ్రీశైలం, మహానంది దేవస్థానాల సమీపంలో
**నెల్లూరు** : మైపాడు బీచ్, స్వర్ణాల చెరువు

జూన్ 7 నుంచి 20 వరకు వివిధ కేటగిరీల్లో నాలుగు స్థాయిల్లో యోగా పోటీలు నిర్వహిస్తారు.

**గ్రామ/వార్డు స్థాయి** : జూన్ 7 నుంచి 9 వరకు
**మండల స్థాయి** : జూన్ 10 నుంచి 12 వరకు
**జిల్లా స్థాయి** : జూన్ 14 నుంచి 16 వరకు
**రాష్ట్ర స్థాయి గ్రాండ్ ఫినాలే** : జూన్ 18 నుంచి 20 వరకు విజయవాడలో

**పోటీలు - విభాగాలు**

**వ్యక్తిగత విభాగం** : ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం
**బృందం** : సింక్రనైజ్డ్ గ్రూప్ యోగా
**జ్ఞాన ఆధారిత పోటీలు** : యోగా క్విజ్, యోగా వ్యాసరచన, యోగా నినాదాల పోటీలు

రాష్ట్ర, జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు అందజేస్తారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనే కార్యక్రమానికి ఆహ్వానిస్తారు.

జూన్ 21న జరిగే యోగా వేడుకల ముగింపు కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా కేంద్రాల్లో భారీఎత్తున నిర్వహిస్తారు. అమరావతిలో కృష్ణా నదిపై నిర్మించిన వంతెనపై 25 వేల మందితో యోగాసనాల కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు.

అదే రోజు అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమాల్లో సుమారు 3 వేల మంది వరకు పాల్గొంటారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని పార్కులు, పాఠశాలలు, క్రీడా ప్రాంగణాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీటన్నింటిలో కలిపి సుమారు కోటి మంది పాల్గొంటారు.

**ఉచితంగా యోగాసనాల వీడియోలు :** ఇంటింటికీ యోగాను చేరువ చేసే కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు నాలుగు కేటగిరీలలో రూపొందించిన వీడియోలను ఉచితంగా వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు.

వివిధ ఆసనాలపై 90 వీడియోలు, రోగ నివారణకు సంబంధించిన 21 ప్రత్యేక వీడియోలు, రోజువారీ సాధన కోసం 7 వీడియోలు, యోగాపై సందేహాలను నివృత్తి చేసే 50 షార్ట్ వీడియోలను రూపొందించారు. వాట్సాప్ నంబర్ : 8142404888 అలాగే సంజీవని యాప్ ద్వారా యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానానికి సంబంధించిన వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

## గోదావరి పరిరక్షణకు పవన్ కళ్యాణ్ చొరవతో వేగవంతమైన చర్యలు

- **మంత్రి కందుల దుర్గేష్**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల చేపట్టిన రాజమహేంద్రవరం పర్యటన రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు కొత్త దిశను చూపిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గోదావరి నదిలో పెరుగుతున్న కాలుష్యంపై పవన్ కళ్యాణ్ వ్యక్తం చేసిన ఆందోళనకు అనుగుణంగా కేవలం 24 గంటల్లోనే రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయి 'ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాబోయే 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పరిశ్రమల వ్యర్థాలు, మురుగునీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రారంభించామని వెల్లడించారు.



గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల పరిధిలో 262 పంచాయతీలను మురుగురహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. 'స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు' లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, కాలుష్య నియంత్రణ మండలి కేటాయించిన రూ.100 కోట్లతో పాటు ఇతర నిధులను వినియోగించి మురుగునీటి శుద్ధి, పారిశ్రామిక కాలుష్య నియంత్రణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అలాగే ఆర్టీజీఎస్ తరహాలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నదుల కాలుష్యాన్ని ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉంచనున్నట్లు వెల్లడించారు.

ప్రతి 15 రోజులకు ఒకసారి టాస్క్ ఫోర్స్ సమావేశమై క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తుందని, పర్యావరణ ప్రమాణాలను ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు, గ్రామీణ ప్రాంతాల్లో మురుగు నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

గోదావరి పరిరక్షణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చూపిన చొరవ వల్ల దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగులు పడ్డాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

## మోదీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ కల సాకారం



- **విశాఖ కేంద్రంగా దక్షిణ తీర రైల్వే జోన్ ఏర్పాటు చారిత్రాత్మకం**
- **బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ తీర రైల్వే జోన్ ఏర్పాటు కల నేడు సాకారమైందని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో స్పందిస్తూ, దశాబ్దాలుగా హామీగా ఉన్న ఈ ప్రాజెక్టు గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలులోకి రావడం రాష్ట్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా అభివర్ణించారు.

ఈ సందర్భంగా దక్షిణ తీర రైల్వే జోన్ ఏర్పాటుకు సహకరించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి నితిన్ నబిన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు కృషి చేసిన ప్రతి నాయకుడికి జేపీ కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు.

## మోదీ హామీ నెరవేర్చారు.. విశాఖ రైల్వే జోన్ కల సాకారం



- **ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చారిత్రాత్మక అడుగు**
- **బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌ఛార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ తీర రైల్వే జోన్ (సౌత్ కోస్ట్ రైల్వే) అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించడం ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిన సందర్భమని బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌ఛార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ప్రత్యేక రైల్వే జోన్ కోసం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆ హామీని అమలు చేసి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని తెలిపారు.

సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడం ద్వారా ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని చెప్పారు. పరిపాలనా సామర్థ్యం పెరగడంతో పాటు కొత్త రైల్వే ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు విస్తరించే అవకాశముందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం భవిష్యత్తులో దేశంలోని ప్రధాన రవాణా, లాజిస్టిక్స్ కేంద్రంగా ఎదగడంలో ఈ రైల్వే జోన్ కీలక పాత్ర పోషిస్తుందని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇది బలమైన పునాది అవుతుందని ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు అభిప్రాయపడ్డారు.

## ఏపీసీసీ చీఫ్ షర్మిలకు రాజ్యసభ సీటు.. ప్రకటించిన అధిష్ఠానం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు కేటాయిస్తున్నట్లు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటన చేశారు. కర్ణాటక నుంచి ఆమెను రాజ్యసభకు పంపుతున్నట్లు ఆయన వెల్లడించారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిన సమయంలోనే.. ఆమెకు రాజ్యసభ సీటు ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కర్ణాటకలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉండగా.. వాటిలో ఒకటి షర్మిలకు కేటాయించింది పార్టీ అధిష్ఠానం. ప్రస్తుతం అక్కడ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉండటంతో.. షర్మిల గెలుపు ఈజీ కానుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

ఏపీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిలకు రాజ్యసభ అవకాశం కల్పించడం ద్వారా సౌతిండియా పాలిటిక్స్‌లో కాంగ్రెస్‌ను మరింత బలపడేలా చేయాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. ఏపీలోనూ పునర్వైభవాన్ని పొందాలని చూస్తోంది. రెండ్రోజుల క్రితమే షర్మిల కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో భేటీ అవ్వగా.. రాజ్యసభకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని వార్తలొచ్చిన విషయం తెలిసిందే.

# రైతుల సంక్షేమం -ప్రజల ఆరోగ్యం -మునుగోడు అభివృద్ధి మా లక్ష్యం





**-ఎల్లంబావి ధాన్యం కొనుగోలు కేంద్రం**

**-చౌటుప్పల్ 100 పడకల ఆసుపత్రి పనులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**

**చౌటుప్పల్, జూన్ 01 (జర్నలిస్ట్ ఫైల్) :** మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చౌటుప్పల్ మండలంలోని ఎల్లంబావి గ్రామ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, చౌటుప్పల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించి రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించారు. ఎల్లంబావి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడిన ఆయన, ధాన్యం కొనుగోలు ప్రక్రియ నెమ్మదిగా సాగడం వల్ల రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం నిల్వలు, తూకం ప్రక్రియ, రవాణా ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో చర్చించారు. రైతులు పండించిన పంటకు సరైన సమయంలో గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ఐదు రోజుల్లోపు ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి జాతీయ రహదారిపై భారీ ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.అనంతరం చౌటుప్పల్‌లో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించిన కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు సహకారంతో ఈ ఆసుపత్రిని మంజూరు చేయించి పనులు ప్రారంభించామని తెలిపారు. తమ హయాంలోనే దాదాపు 60 శాతం పనులు పూర్తయ్యాయని, కానీ గత రెండున్నర సంవత్సరాలుగా మిగిలిన పనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు.కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం వల్లే నిర్మాణ పనులు నిలిచిపోయాయని, నిధుల కొరత కారణంగా ప్రాజెక్టు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. ప్రాంత ప్రజల ఆరోగ్యానికి అత్యంత కీలకమైన ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి, నాణ్యతతో కూడిన నిర్మాణ పనులను పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టును రాజకీయ నిర్లక్ష్యానికి బలి చేయరాదన్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ప్రజల అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా ముందుకు సాగాలని సూచించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు, అభివృద్ధి పనుల్లో జాప్యాలపై ప్రజల్లో ఉన్న ఆందోళనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తే ప్రజల ఆదరణ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిలో రాజీ పడకుండా పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు."రైతుల సంక్షేమం-ప్రజల ఆరోగ్యం-మునుగోడు అభివృద్ధి మా లక్ష్యం" అని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

# జీవో నెం.17పై పేద కాంట్రాక్టర్లకు ఊరట కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు



**రామ్ మందిర్ ఏరియా, జూన్ 01 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర వసతి గృహాలలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో నెం.17 కారణంగా చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సుమారు 15 వేల మంది ప్రత్యక్షంగా, మరో 30 వేల మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని తెలంగాణ రాష్ట్ర గురుకుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంకటి లింగమూర్తి తెలిపారు.ఈ సమస్యను గతంలో మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి, చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితిని వివరిస్తూ వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. పేద కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో గతంలో అమలులో ఉన్న విధానాన్ని కొనసాగిస్తూ ఎస్సీలకు రిజర్వేషన్ శాతానికి అనుగుణంగా సబ్సిడీ కల్పించాలని, అలాగే వసతి గృహాలను ఒక్కొక్కటిగా టెండర్ల ద్వారా కేటాయించాలని కోరినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం 29-05-2026న విడుదల చేసిన సర్క్యులర్ ద్వారా చిన్న కాంట్రాక్టర్లకు ఊరట కల్పించే నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పేదల జీవనోపాధిని పరిరక్షించే చర్యలు చేపట్టిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర గురుకుల అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కమిటీ సభ్యులు నూతి తిరుపతి, బి. తిరుపతి మిట్టపల్లి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు

# పదవి విరమణ పొందిన ట్రాఫిక్ ఎస్ఐ సలాం ఖాన్ కి ఘన సన్మానం




**నంద్యాల, జూన్ 01(జర్నలిస్ట్ ఫైల్) :** నంద్యాల పట్టణంలోని ట్రాఫిక్ ఎస్ఐ సలాం ఖాన్ పదవి విరమణ కాబడిన సందర్భంగా ఆయనను ఘనంగా పూల మాలతో సత్కరించారు. 1987వ సంవత్సరంలో పోలీస్ కానిస్టేబుల్ గా నియామకం ఉంది ఉమ్మడి కర్నూల్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లో పనిచేయడం జరిగింది. 2010వ సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్ గా, 2014వ సంవత్సరంలో అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్గా, 2022వ సంవత్సరంలో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా పదోన్నతి పొందారు. 39 సంవత్సరాలు పోలీస్ శాఖకు సేవలు అందించడం అభినందనీయమని ఆయనను కొనియాడారు. ఆయన సేవలు పోలీస్ శాఖలో మరువలేము అని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సలాం ఖాన్ అల్లుడు కానిస్టేబుల్ షాకీర్, కూతురు మెహతాజ్, మనవాళ్లు మనవుడు జమీల్ , జూనియాత్ తదితరులు పాల్గొన్నారు

# ట్రాలీ ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



**తాండూర్,(జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలో ఆదివారం ట్రాలీ ఆటో యూనియన్ తాండూర్ మండల నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పెద్దబోయిన చిలుకయ్య, ఉపాధ్యక్షులుగా బండారి అంజయ్య, కోశాధికారి అతిక్ పాషా, సలహాదారులుగా రాము, రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు చిలుకయ్య మాట్లాడుతూ, ట్రాలీ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్మికుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు

# బీసీలంతా ఏకం కావాలి: రవికుమార్ యాదవ్



**శేరిలింగంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** బీసీల్లోని అన్ని కుల సంఘాలు ఏకమై, అందరూ ఒకచోట కలిసేలా ఉమ్మడి వేదికలను ఏర్పాటు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని కైతలాపూర్ పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో ఇజ్జత్ నగర్ తెలంగాణ ఐక్యత ముదిరాజ్ సంఘం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఒక్క ముదిరాజ్ సంఘం మాత్రమే కాకుండా బీసీ సమాజమంతా ఏకతాటిపైకి వచ్చి ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్లుగా విజయవంతంగా నడుస్తూ అందరినీ కలుపుకుపోతున్న ముదిరాజ్ సంఘం సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, సంతోష్, గోవర్ధన్, కృష్ణయ్య, సుధాకర్, సలేశ్వరం, రాములు, భిక్షపతి, కుర్మయ్య, ముదిరాజ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# పేద మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



**శేరిలింగంపల్లి,(జర్నలిస్ట్ ఫైల్) :** పేద మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ తమ కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు కుట్టుమిషన్లు ఎంతగానో తోడ్పడతాయని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ సీనియర్ నాయకుడు మిరియాల ప్రీతమ్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీ నివాసంలో తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావులతో కలిసి ముగ్గురు మహిళలకు కుట్టుమిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా నిలబడటం గొప్ప విషయమని, ప్రీతమ్ చేసిన ఈ సాయం అభినందనీయమన్నారు. లబ్ధిదారులు ఈ మిషన్లను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని, మహిళా సోదరీమణులకు ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిరియాల రాఘవ రావు, నాయినేని చంద్రకాంత్ రావు, రజిని, కుమారి పాల్గొన్నారు

# నృత్యభరితం.. శిల్పారామం



**శేరిలింగంపల్లి,(జర్నలిస్ట్ ఫైల్) :** మాదాపూర్ లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక వేదిక ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలతో నృత్యభరితంగా మారింది. బెంగళూరుకు చెందిన కూచిపూడి నాట్యకళాకారిణి అనఘా ప్రకాష్ శిష్య బృందం కళాకారులు శాలివి, గంగిశెట్టి, ఆరిన, హాసిని, అవ్యక్త, సౌమ్య తమ అద్భుత అభినయంతో పూర్వరంగం, భో శంభో, తరంగం అంశాలను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. అనంతరం హిందూపురం నాట్య గురువు విద్యాధరి బృందం ప్రదర్శించిన గణపతి తాళం, జాతి స్వరం, జనుత శబ్దం, అష్టపది, ప్రహ్లాద పట్టాభిషేకం, కృష్ణం కలయ సఖి, దశావతార శబ్దం, మండూక శబ్దం వంటి కూచిపూడి సాంప్రదాయ నృత్య రీతులు వీక్షకులకు కనువిందు చేశాయి. పల్లె ప్రకృతి వాతావరణంలో జరిగిన ఈ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు వారాంతంలో శిల్పారామానికి వచ్చిన పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచాయి.

# 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై.. పూర్వ విద్యార్థినుల సందడి



**రాయికల్, జూన్ 01(జర్నలిస్ట్ ఫైల్) :** పాఠశాల రోజుల్లో కలిసి చదువుకున్న స్నేహితులను మరోసారి కలుసు కోవాలన్న ఆకాంక్షతో రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (2005--06 విద్యా సంవత్సరం) పూర్వ విద్యార్థినులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై సమావేశమైన విద్యార్థినులు ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.పాఠశాల దశలో చేసిన అల్లరి పనులు, ఉపాధ్యాయులు బోధించిన పాఠాలు, చదువు పూర్తయ్యాక జీవితంలో ఎవరెవరు ఏ స్థాయికి చేరుకున్నారనే విషయాలను పరస్పరం పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ సమ్మేళనంలో విద్యార్థి దశలో జరిగిన ఎన్నో సంఘటనలను స్మరించుకుంటూ ఆనందంగా గడిపారు.ఆడుతూ, పాడుతూ,కేరింతలు కొడుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. కరీంనగర్, హైదరాబాద్, కోరుట్ల, జగిత్యాల, నిజామాబాద్, మంచిర్యాల, మెట్పల్లి తదితర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థినులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థినులు పావని, పద్మ, శ్రావణి, స్రవంతి, తేజస్విని, రాధ, సునీత, లావణ్య, జ్ఞానేశ్వరి, కావ్య, మమత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో భవిష్యత్తులోనూ ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తూ పరస్పర అనుబంధాన్ని కొనసాగించాలనే నిర్ణయం తీసుకున్నారు

## విద్యార్థులకు అలర్ట్- ముగిసిన వేసవి సెలవులు

హైదరాబాద్, జూన్ 1(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర విద్యార్థులకు ఇంటర్ బోర్డు కీలక అప్‌డేట్ జారీ చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం నేటి నుంచి ఇంటర్ కాలేజీలు తెలరచుకోనున్నాయి.ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థుల కోసం జూనియర్ కాలేజీల్లో సోమవారం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి. వేసవి సెలవుల అనంతరం సోమవారం (జూన్ 1) నుంచి జూనియర్ కాలేజీలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు అకడమిక్ క్యాలెండర్‌ను ఇప్పటికే విడుదల చేసింది. జూన్ 1 నుంచే ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ క్లాసులు ప్రారంభిస్తామని ఇంటర్‌బోర్డు అధికారులు గతంలోనే వెల్లడించారు.మరోవైపు ఏపీలోనూ ఇంటర్ తరగతులు జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభం కావల్సి ఉంది. అయితే మండే ఎండల తీవ్రత దృష్ట్యా వేసవి సెలవులను మరికొన్ని రోజులు పొడిగించారు. దీంతో ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కాలేజీలు జూన్ 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి.

## తెలంగాణ ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టిఓఎస్ఎస్) రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన టెన్త్ (ఎస్ ఎస్ సి), ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను తాజాగా విడుదల చేసింది. ఈ పరీక్షలకు హాజరైన వేలాది మంది విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లో అడ్మిషన్ నంబర్ లేదా లాగిన్ వివరాలను నమోదు చేసి మార్కులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో షెడ్యూల్ ప్రకారం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షలను వేర్వేరు కేంద్రాల్లో నిర్వహించారు. ఓపెన్ టెన్త్ పరీక్షలు 36,863 మంది రాయగా ఇందులో 26,542 మంది (72 శాతం) పాస్ అయ్యారు. ఇక ఓపెన్ ఇంటర్ పరీక్షలు 54,679 రాయగా ఇందులో 37, 562 మంది (68.70 శాతం) పాస్ అయ్యారు. జూన్ 2 నుంచి 7 వరకు రీకౌంటింగ్ దరఖాస్తు చేసుకోవచ్చు. పదో తరగతి రీకౌంటింగ్ ఫీజు రూ.350, ఇంటర్‌కు రూ.400గా నిర్ణయించారు.

## వైద్య శిబిరం విజయవంతానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

: కమ్మ మహాజన సంఘం

ఖమ్మం, జూన్ 01 (జర్నలిస్ట్ ఫైల్): నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వైద్య నిపుణులు, కేమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, డయాగ్నస్టిక్ కేంద్రాలు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ కమ్మ మహాజన సంఘం, ఖమ్మం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది.ప్రజారోగ్య సేవే లక్ష్యంగా తమ విలువైన సమయాన్ని వెచ్చించి ఉచిత వైద్య సేవలు అందించిన వైద్యులకు ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే ఔషధాల పంపిణీ, వైద్య సామగ్రి సమకూర్చడం, పరీక్షల నిర్వహణలో సహకరించిన కేమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సభ్యులకు, డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వాహకులకు సంఘం ప్రత్యేక అభినందనలు తెలియజేస్తోంది.ఈ మహోన్నత సేవా కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరి సేవలను కమ్మ మహాజన సంఘం ఎల్లప్పుడూ స్మరించుకుంటుంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు మీ సహకారం కొనసాగాలని ఆకాంక్షిస్తూ మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అని కమ్మ మహాజన సంఘం, ఖమ్మం తెలిపింది.

## ఎర్ర మట్టి తరలిస్తుండగా....

లారీలను -సీజ్ చేసిన పోలీసులు...!

హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 01 (జర్నలిస్ట్ ఫైల్) : హనుమకొండ జిల్లా ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నీరుకుల్లా క్రాస్ రోడ్ వద్ద ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ జరుగుతుండగా 3 లారీలు ఎర్రమట్టితో పట్టుబడినట్లు స్థానిక సీఐ సంతోష్ తెలిపారు. వే బిల్లులు, పర్మిషన్ లేకుండా అక్రమంగా దొంగ చాటుగా మల్లంపల్లి నుండి హనుమకొండ, , సంగం ప్రాంతాలకు ఎర్రమట్టిని టిప్పర్లు లారీలలో తరలిస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకున్నట్టు పేర్కొన్నారు. టిప్పర్ లారీ నంబర్ ఏపీ 36 టీబి 5577 లారీ నంబర్ డ్రైవర్ పేరు మదువత్ రవి(45 )సం; మహబూబాబాద్ జిల్లా, నరసింహులుపేటగ్రామం చెందిన వాడు, దీని ఓనర్ వైనాల వేణు ములుగు జిల్లా జంగాలపల్లి గ్రామ నివాసి, అలాగే రెండవ టిప్పర్ లారీ నంబర్ టీ 71 93 దీని డ్రైవర్ బెల్లి సురేందర్ ( 45 )సం; ఇతను ములుగు జిల్లా పందికుంట గ్రామం నివాసం, ఈ లారీ ఓనర్ గూగుల్లోతు శ్రీను ములుగు జిల్లా మల్లంపల్లి, ఇతనికి మరొక లారీ కూడా ఉంది. దీని నెంబర్ టీజీ 37టీ 0 508 డ్రైవర్ అంకం నితిన్, ములుగు జిల్లా మల్లంపల్లి మండలానికి చెందిన వాడని సి. ఐ. సంతోష్ తెలిపారు. ఇట్టి వ్యక్తులు ఎర్ర మట్టి టిప్పర్ లారీల ద్వారా తీసుకెళ్లి అధిక ధరలకు మట్టిని అమ్ముకుంటున్నారని చెప్పారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న వీరందరిపై క్రైమ్ నెంబర్: 110/2 026. సెక్షన్ యు/స్ 303(2), బి.ఎన్. స్. మరియు సెక్షన 21(2) ఎం ఎం యాక్ట్ ప్రకారంగా కేసు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## జిల్లా ప్రజల సెంటిమెంట్‌కు గౌరవం..

అందుకే పార్టీ జెండాలో పసుపు రంగు

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత



(నిజామాబాద్ రూరల్ సిరికొండ జర్నలిస్ట్ ఫైల్ ప్రతినిధి) నిజామాబాద్ జిల్లా ప్రజల ఆకాంక్షలు, వారి సెంటిమెంట్‌కు విలువనిస్తూనే తన పార్టీ జెండాలో పసుపు రంగును చేర్చినట్లు తెలంగాణ రక్షణ సేన అధినేత్రి (చీఫ్) కవిత స్పష్టం చేశారు. ఇటీవల ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా ప్రజలకు, ముఖ్యంగా ఇక్కడి రైతులకు 'పసుపు' అనేది కేవలం ఒక పంట మాత్రమే కాదని, అది వారి జీవితాలతో ముడిపడి ఉన్న ఒక గొప్ప సెంటిమెంట్ అని అన్నారు. జిల్లాలో అత్యధికంగా పసుపు పంటను పండిస్తారని ఆమె గుర్తు చేశారు.

ఆడబిడ్డల సెంటిమెంట్, తెలంగాణ సౌభాగ్యం:

"మన సంస్కృతిలో ప్రతి ఆడబిడ్డకు పసుపు అనేది అత్యంత పవిత్రమైన సెంటిమెంట్. తెలంగాణ రాష్ట్రం ఎల్లప్పుడూ సమున్నతంగా, సౌభాగ్యంతో వర్ధిల్లాలనే ఉద్దేశంతోనే మా పార్టీ జెండాలో పసుపు రంగును ప్రత్యేకంగా చేర్చడం జరిగింది," అని కవిత వివరించారు.తెలంగాణ రక్షణ సేన ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, జిల్లా రైతాంగం మరియు ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతుందని ఈ సందర్భంగా తెలియజేసారు

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

: జిల్లా కలెక్టర్ అంకిత్.




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 01 (జర్నలిస్ట్ ఫైల్) : సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధితో ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపడతాయి

. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

గోదావరి పుష్కరాలు--2027కు భారీ స్థాయిలో ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పిస్తాం

మహిళలకు 310 కోట్లకు పైగా జీరో టికెట్లు జారీ చేశాం.. త్వరలో పెద్దపల్లి బస్ డిపో ప్రారంభం...

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు..మంథని బస్టాండ్‌లో రూ.93 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు



మంథని, జూన్ 01 (జర్నలిస్ట్ ఫైల్) : మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధితో ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపడతాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.మంథని మున్సిపాలిటీ పరిధిలోని మంథని బస్టాండ్‌లో రూ.93 లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు ప్లాట్‌ఫారాలు, ఇతర అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష లతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మంత్రి శ్రీధర్ బాబు సూచనల మేరకు మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గోదావరి పుష్కరాలు--2027 నిర్వహణ కోసం ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించిందని, కుంభమేళాను తలపించే స్థాయిలో పుష్కరాలు నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు.కోట్లాది మంది భక్తులు పుష్కరాలకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామం నుంచి పుష్కర క్షేత్రాలకు చేరుకునేలా ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు బస్టాండ్లను ఆధునికీకరించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సమ్మక్క--సారలమ్మ జాతరకు ఏర్పాటు చేసిన తరహాలోనే పుష్కరాల సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని తెలిపారు.గత పదేళ్లలో కొత్త బస్సుల కొనుగోలు, నియామకాలు, డిపోల ఏర్పాటు వంటి అంశాలను విస్మరించారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు చేపట్టిందన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలు, డిపోల ఏర్పాటు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ఇప్పటివరకు దాదాపు 310 కోట్ల జీరో టికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్టీసీ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తుండగా, బస్సులు దాదాపు 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన కనెక్టివిటీ కల్పించే దిశగా బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచుతున్నామని చెప్పారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గుర్తింపు సంఘాల ఎన్నికల అనంతరం కార్మిక ప్రతినిధులతో చర్చించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. కార్మికులు అపోహలు నమ్మవద్దని మంత్రి సూచించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మంథని బస్టాండ్‌లో రెండు అదనపు ప్లాట్‌ఫారాల నిర్మాణానికి రూ.74 లక్షలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.19 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కాళేశ్వరం బస్టాండ్ అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేశామని, కాళేశ్వరం దేవస్థాన అభివృద్ధిలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.దశాబ్దాలుగా ప్రజల ఆకాంక్షగా ఉన్న పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటు త్వరలోనే సాకారం కానుందని, మంథని బస్టాండ్ ఆధునికీకరణతో పాటు పెద్దపల్లి బస్ డిపోను కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.ఆర్టీసీ కార్మికుల ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో రవాణా శాఖ మంత్రి, ఇతర మంత్రులతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల అనంతరం కార్మిక ప్రతినిధులతో చర్చించి ఆర్టీసీ విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ , శశిభూషన్ కాచే, తోట్ల తిరుపతి యాదవ్, ప్రసాద్, మంథని సురేష్, రీజనల్ కరీంనగర్ మేనేజర్ రాజు, డిప్యూటీ ఆర్.యం.(ఎం) మల్లేశం, డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్, ఆర్డిఓ సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్టీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మూడుచింతలపల్లిలో అర్ధరాత్రి మట్టి దందా కలకలం

ప్రభుత్వ భూములే లక్ష్యమా.

శాలవాని కుంట వద్ద భారీ యంత్రాలతో తవ్వకాల ఆరోపణలు.గ్రామస్థుల సమాచారంతో రెవెన్యూ దాడులు.. 2 జేసీబీలు, 3 టిప్పర్లు స్వాధీనం



శామీర్‌పేట, (జర్నలిస్ట్ ఫైల్) : మూడుచింతలపల్లి గ్రామ పరిధిలోని శాలవాని కుంట సమీపంలో అర్ధరాత్రి వేళ జరిగినట్లు ఆరోపణలు వస్తున్న మట్టి తవ్వకాల వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు భారీ యంత్రాలతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. స్థానికుల సమాచారంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి మూడు టిప్పర్లు, రెండు జేసీబీలను స్వాధీనం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.స్థానికుల కథనం ప్రకారం, శనివారం అర్ధరాత్రి సమయంలో శాలవాని కుంటకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో దాదాపు పది టిప్పర్లు, మూడు జేసీబీలతో మట్టి తవ్వకాలు కొనసాగుతున్నట్లు గుర్తించారు. భారీ వాహనాల రాకపోకలు, యంత్రాల శబ్దాలతో అప్రమత్తమైన గ్రామస్థులు అక్కడికి చేరుకుని తవ్వకాలపై ప్రశ్నించగా వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. తాము ఎవరినీ లెక్కచేయమన్న ధోరణిలో కొందరు వ్యవహరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.చెరువులు, ప్రభుత్వ భూములకు రక్షణ ఎక్కడ శాలవాని కుంటకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ప్రజల్లో ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యత కలిగిన శాఖలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములపై నిరంతర పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.స్థానికుల సమాచారంతో రంగంలోకి అధికారులుగ్రామస్థుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న రెవెన్యూ అధికారులు పరిస్థితిని పరిశీలించారు. తనిఖీల సందర్భంగా మట్టి తరలింపునకు వినియోగిస్తున్నట్లు గుర్తించిన మూడు టిప్పర్లు, రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మిగిలిన వాహనాల వివరాలను సేకరించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిసింది.తవ్వకాల వెనుక ఉన్నవారెవరుప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాల కోసం అవసరమైన అనుమతులు ఉన్నాయా నిబంధనలు పాటించారా తవ్వకాల వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.మూడుచింతలపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనతో ప్రభుత్వ భూముల సంరక్షణ, అక్రమ తవ్వకాల నియంత్రణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజా ఆస్తుల పరిరక్షణ విషయంలో అధికారులు ఎంత మేరకు కఠినంగా వ్యవహరిస్తారన్నది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.







## గీసుగొండ పోలీసుల సక్సెస్

-వరుస చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలు అరెస్ట్ :



వరంగల్ ప్రతినిధి జూన్ 01 (జర్నలిస్ట్ ఫైల్) : వరుస చోరీలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఇద్దరు నిందితులను గీసుకొండ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని గీసుకొండ సీఐ విశ్వేశ్వర్ శనివారం పోలీస్ స్టేషన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు.సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై అనిల్ తన సిబ్బందితో కలిసి కోనాయమాకుల ఎస్‌ఆర్‌ఎస్పీ కాలువ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారు కరీంనగర్‌కు చెందిన సూర రవి, మహబూబాబాద్‌కు చెందిన ఎండీ ఇమ్రాన్‌గా గుర్తించారు.పోలీసుల విచారణలో ఇద్దరూ పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి చోరీ చేసిన వివిధ వస్తువులతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు మొత్తం విలువ సుమారు 35 వేల వరకు ఉంటుంది అని పోలీసులు తెలిపారు. నిందితుల నేర చరిత్ర కూడా ఉన్నట్టు విచారణలో వెల్లడయింది.సూర రవిపై కరీంనగర్, కేశవపట్నం, బోయినపల్లి, మానకొండూరు, మిల్స్ కాలనీ, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 24 చోరీ కేసులు నమోదయ్యాయి. అలాగే ఎండి ఇమ్రాన్ పై వరంగల్ మిల్స్ కాలనీ, నర్సంపేట ఖాన్పూర్ ,మహబూబాబాద్ నగర్ , గీసుకొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో తొమ్మిది చోరీ కేసును నమోదైనట్లు సీఐ వెల్లడించారు.ఇద్దరు నిందితులపై ఇప్పటికే సస్పెక్ట్ షీట్లు కొనసాగుతున్నాయని వారిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా రిమాండ్ కు తరలించినట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు

## చిలువేరు శ్రీనివాస్ ను సన్మానించిన డివిజన్ కాంగ్రెస్ నాయకులు



వరంగల్ ప్రతినిధి జూన్ 01 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఎస్సీ సెల్‌ను పునర్వ్యవస్థీకరిస్తూ, రాష్ట్రంలోని 27 జిల్లాలకు నూతన చైర్మన్లను మరియు కొత్త రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఈ నియామకాలను అధికారికంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా నుండి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా చిలువేరు శ్రీనివాస్ ను ప్రకటించారు.ఇందులో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ మధుర నగర్ కాలనీకి చెందిన చిలువేరు శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనందున డివిజన్ లోని కాంగ్రెస్ పార్టీ గ్రామ ఎస్సీ సెల్,నాయకులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు,డివిజన్ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున,14వ డివిజన్ బాలాజీ నగర్ జంక్షన్ లో ఘనంగా శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి సరైన గుర్తింపు, తగిన ఫలితాలు లభిస్తాయని చెప్పడానికి పార్టీలో వివిధ స్థాయిల్లో పనిచేసిన సీనియర్లకు, యువనాయకులకు లభించిన అవకాశాలే నిదర్శనం. పైన అంశాల ద్వారా పార్టీలో కష్టానికి తగిన ప్రతిఫలం ఎలా అందుతుందో స్పష్టమవుతుందని శ్రీనివాస్ యొక్క సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం యొక్క బాధ్యతను అప్పగించడం హర్షనీయమని పేర్కొన్నారు.

పార్టీలో కష్టపడ్డ ప్రతి వారికి ఫలితాలు లభిస్తాయి కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన కార్యకర్తలు మరియు నాయకులకు సరైన గుర్తింపు, తగిన ఫలితాలు అందడం పార్టీ అంతర్గత విధానాలు, నాయకత్వ నిర్ణయాలు మరియు ప్రాంతీయ రాజకీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. గతంలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన వారికి ప్రాధాన్యత లభించింది.కింది స్థాయి నుంచి పార్టీని నమ్ముకుని పనిచేసే కార్యకర్తలకు మండల, జిల్లా స్థాయి కమిటీల్లో పదవులు, కార్పొరేషన్ చైర్మన్ పదవులు, మరియు ప్రభుత్వ నామినేటెడ్ పదవులు దక్కే అవకాశం ఉంటుందన్నారు.సామాజిక న్యాయం: పార్టీ అధిష్టానం సామాజిక సమీకరణాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కష్టపడేవారికి గుర్తింపునిచ్చే ప్రయత్నం చేస్తుందని చిలువేరు శ్రీనివాస్ అన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ,అధ్యక్షులు సయ్యద్ ఇంతియాజ్, వివిధ గ్రామ శాఖల అధ్యక్షులు, ఈర్ల రాజేందర్,సారం చిన్నయ్య,ముచ్చర్ల స్టాలిన్, కంచ శ్రీను,కడెం కుమార్,ఎల్లయ్య ప్రకాశం,లింగస్వామి,బూస మహేష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో పాల్గొనాలి..!

రిటైర్డ్ పోలీస్ అధికారులకు వీడ్కోలు:

--అదనపు డిసిపి : రవి --



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 01 (జర్నలిస్ట్ ఫైల్) : ఉద్యోగులు పదవి విరమణ అనంతరం సామాజిక సేవలో చురుకుగా పాల్గొనాలని, ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక ప్రయోజనాలను జాగ్రత్తగా, కుటుంబ భవిష్యత్తుకు ఉపయోగపడునట్లు వాటిని వాడుకోవాలని పోలీస్ పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి అన్నారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగం ద్వారా సేవలందించిన పలువురు పోలీసు అధికారులు ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా హనుమకొండ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారికి ఘనంగా వీడ్కోలు పలికి సన్మానించారు.పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.డి. నజీర్, ఆర్ఎస్ఐ రవికుమార్, ఏఆర్ఎస్ఐలు రమేష్, మల్లారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు నారాయణ, అశోక్‌లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు నాగయ్య, అంతయ్య, ఆర్ఐలు సతీష్, శ్రీధర్, ఆర్ఎస్ఐ శ్రావణ్ కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..

# అభివృద్ధి, సంక్షేమమే చంద్రబాబు విజన్ - ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** నియోజకవర్గంలో సోమవారం ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని తన నివాసం నుండి స్వయంగా విద్యుత్ ద్విచక్ర వాహనంపై ప్రయాణించి, మార్టిన్ కాలనీకి చేరుకున్నారు. అక్కడ లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఇళ్ల వద్దకే వెళ్లి నేరుగా పింఛన్ డబ్బులను ఇస్తూ వారితో ముచ్చటించి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో పింఛన్లను అందిస్తూ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

**పింఛన్ల పంపిణీలో దేశంలోనే ఏపీ నంబర్ వన్**

రాష్ట్రంలో 68 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతి నెల రూ. 33,500 కోట్ల వార్షిక బడ్జెట్‌తో పింఛన్లు ఇస్తుండటం తమ ప్రభుత్వానికి ఎంతో గర్వకారణంగా ఉనిందని జీవీ ఆంజనేయులు తెలిపారు. గత వైసీపీ పాలనలో పింఛన్లు ఎప్పుడు వస్తాయో తెలియక అవ్వాతాతలు తీవ్ర ఆందోళన చెందారని, ఉద్యోగులు కూడా జీతాల కోసం నెలల తరబడి ఎదురుచూసే దుస్థితి ఉండేదన్నారు. కానీ నేడు చంద్రబాబు నాయుడి హయాంలో ఒకటో తారీఖునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంచుతున్నామని.. సెలవు దినం వస్తే అంతకంటే ముందే అందజేస్తున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సాధారణ పింఛను రూ. 4,000కు, దివ్యాంగుల పింఛను రూ. 6,000కు పెంచిన ఘనత తమ కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**రూ. 2.02 కోట్లతో చెత్త శుద్ధి కేంద్రానికి శంకుస్థాపన**

అనంతరం కారంపూడి రోడ్డులోని చెక్కవాగు ప్రాంతంలో రూ. 2.02 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 'తడి మరియు పొడి చెత్త వ్యర్థాల శుద్ధి కేంద్రానికి' జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావుతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 నిధుల ద్వారా చేపడుతున్న ఈ అత్యాధునిక కేంద్రం వల్ల వినుకొండ పట్టణం మరింత పరిశుభ్రంగా మారుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం కేవలం అసత్య ప్రచారాలు చేసిందే తప్ప సాధించింది ఏమీ లేదని దుయ్యబట్టారు.

కూటమి ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో 'చెత్త నుండి సంపద'ను సృష్టించి, తద్వారా పురపాలక సంఘానికి అదనపు ఆదాయం చేకూరేలా ప్రణాళికలు సిద్ధం చేసిందని, ఈ కేంద్రం పట్టణ ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతో దోహదపడుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పార్టీల ముఖ్య నాయకులు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## చిరువ్యాపారులకు అండగా మంత్రి లోకేష్



○ **తాడేపల్లిలో ప్లాట్‌ఫామ్ రిక్షా, టిఫిన్ బండి పంపిణీ**

**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో తాడేపల్లికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు జీవనోపాధి కల్పించే ఉపాధి బండ్లను అందజేశారు. తాడేపల్లి 14వ వార్డుకు చెందిన చిలక రూబేనుకు ఫ్లాట్‌ఫామ్ రిక్షా, 13వ వార్డుకు చెందిన చిరు వ్యాపారి షేక్ హుస్సేన్ బీకి టిఫిన్ బండిని అందజేశారు.

తాడేపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, పేదలు మరియు చిరువ్యాపారులకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేక పుల్లారెడ్డి, అద్దంకి మురళి, దారా నాని, ఎస్.కె. చాంద్ భాషా, గోలి సౌరి, కాటా బత్తుల నిర్మల, కుందుర్తి కోటేశ్వరావు, కళ్యాణి, బొలెద్దుల్లో మరియన్న, షేక్ మస్తాన్ వలి, తాళ్లూరు శీను, కైలా నాని, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు. మంత్రి నారా లోకేష్ అందించిన సహాయంపై లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



○ **నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సాంబశివరావు**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల నుండి అందే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జి. సాంబశివరావు సంబంధిత విభాగాధిపతులను ఆదేశించారు. సోమవారం నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, పీజీఆర్ఎస్‌కు అందుతున్న ఫిర్యాదుల్లో ఎక్కువగా పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించినవే ఉంటున్నాయని తెలిపారు. వాటిని ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో ఏవైనా సాంకేతిక లేదా పరిపాలనా ఇబ్బందులు ఉంటే దరఖాస్తుదారులకు స్పష్టంగా వివరించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, నిర్లక్ష్యం వహించి గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మొత్తం 64 అర్జీలు అందాయని తెలిపారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 19, ఇంజినీరింగ్ విభాగానికి 29, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 6, యూసీడీ విభాగానికి 2, అకౌంట్స్ విభాగానికి 2 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు, డీసీపీ సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

## 2030 నాటికి మలేరియా నిర్మూలనే లక్ష్యం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** 2030 నాటికి మలేరియా రహిత భారతదేశం లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెనాలి ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ తెలిపారు. స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాలలో మలేరియా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆమె పాల్గొని అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాకాలంలో నిల్వ నీటి కారణంగా దోమల సంతతి పెరిగి మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మువ్వా ఏసుబాబు మాట్లాడుతూ మలేరియాకు పూర్తి చికిత్స అందుబాటులో ఉందని, జ్వరం, చలి, వణుకు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే'గా పాటించి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. అనంతరం శివాజీ చౌక్ వద్ద ఆరోగ్య సిబ్బందితో మానవహారం నిర్వహించి మలేరియా వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుంటూరుకు యునిడో జెండర్ ఈక్వాలిటీ మొబిలైజేషన్ అవార్డు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ (జీఎంసీ) అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. ఐక్యరాజ్యసమితికి చెందిన యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యునిడో) ప్రతిష్ఠాత్మకంగా అందించే 'జెండర్ ఈక్వాలిటీ మొబిలైజేషన్' అవార్డుకు గుంటూరు నగరపాలక సంస్థ ఎంపికైంది. సోమవారం విజయవాడలోని లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్‌లో నిర్వహించిన 'సస్టైనబుల్ సిటీస్ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ పైలట్ (ఎస్‌సీ-ఐఏపీ)' ప్రాజెక్టు వర్క్‌షాప్‌లో జీఎంసీ కమిషనర్ కె. మయూర్ అశోక్ మహిళా పారిశుధ్య కార్మికులతో కలిసి ఈ అవార్డును కేంద్ర స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ సురభి మాలిక్ చేతుల మీదుగా అందుకున్నారు.

మహిళా సాధికారతను పర్యావరణ పరిరక్షణతో అనుసంధానిస్తూ జీఎంసీ అమలు చేసిన వినూత్న కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అంతర్జాతీయ పురస్కారం లభించింది. పారిశుధ్య నిర్వహణలో మహిళలకు పెద్దపీట వేయడం, మహిళా కార్మికులనే డ్రైవర్లుగా నియమించి ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా చెత్త సేకరణ చేపట్టడం, జీరో ఉద్గారాల లక్ష్యంతో నగర పరిశుభ్రతను మెరుగుపరచడం వంటి చర్యలు అంతర్జాతీయ ప్రతినిధులను ఆకట్టుకున్నాయి. దేశవ్యాప్తంగా ఎంపికైన ఐదు సస్టైనబుల్ సిటీస్‌లో గుంటూరు ఒకటిగా ఉండటం ఈ అవార్డుకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

ఈ సందర్భంగా కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ, ఈ అవార్డు నగర ప్రజారోగ్య విభాగానికి చెందిన పారిశుధ్య కార్మికులకు, ముఖ్యంగా మహిళా కార్మికులకే అంకితమని తెలిపారు. గుంటూరుకు లభించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ పట్ల మరింత బాధ్యతను పెంచిందన్నారు. భవిష్యత్తులో కూడా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో గుంటూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## జలధార పనులను జూన్ 15 నాటికి పూర్తి చేయాలి : కలెక్టర్ సాయికాంత్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో చేపడుతున్న జలధార పనులను జూన్ 15 నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ఆయన పరిశీలించారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని, అసంపూర్తిగా ఫిర్యాదులను క్లోజ్ చేసిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ, రీ-సర్వే ఈ-కేవైసీ ప్రక్రియలను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

గుంటూరు ఛానల్ ఆధునీకరణ, ఇరిగేషన్ కాలువల్లో గుర్రపు డెక్కల తొలగింపు, పీకల వాగులో వ్యర్థాల తొలగింపు పనులను జూన్ 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల నాటడానికి స్థలాలను గుర్తించాలని, హౌస్ సైట్ రెగ్యులరైజేషన్, అక్షర ఆంధ్ర రిజిస్ట్రేషన్లు, తల్లికి వందనం పథకం విద్యార్థుల డేటా ధృవీకరణ వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఆధార్ లేని చిన్నారులకు ఆధార్ కార్డులు అందజేయడం, అంగన్‌వాడీ మరియు పాఠశాలల్లో అర్హులైన పిల్లలందరి నమోదు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం రాష్ట్ర స్థాయి కార్యక్రమం అమరావతిలో నిర్వహించే అవకాశాలు ఉన్నందున సంబంధిత శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కర్మయోగి ఐగాట్ పోర్టల్‌లో నెలకు కనీసం మూడు కోర్సులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె. విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ ఇండిపెండెంట్ పాస్టర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ కార్యవర్గం



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఇండిపెండెంట్ పాస్టర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడిగా రావూరి విక్టర్ పాల్ ఎన్నికయ్యారు తెనాలి, ఏపీ ఇండిపెండెంట్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం పట్టణంలోని ఐతానగర్ భక్తుల వారి వీధిలో గల అపోస్తులకల్ చర్చిలో జరిగింది. మంగళవారం జరిగిన సమావేశంలో తెనాలి టౌన్ కమిటీ ఎన్నిక జరిగింది. టౌన్ కమిటీ అధ్యక్షులుగా రావూరి విక్టర్ పాల్ ఎన్నికయ్యారు. సమావేశానికి రావురి విక్టర్ పాల్ అధ్యక్షత వహించారు.

సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కావూరి జకరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫెడరేషన్ దళిత క్రైస్తవులు దళితులపై జరుగుతున్న దాడులను అందరం ఉమ్మడిగా దొరుకుందామని ఉద్దేశపూర్వకంగా ఏర్పాటు చేశామన్నారు. సమస్త ఏర్పాట్లు ప్రధాన ఉద్దేశం పాస్టర్లకు సహాయ సహకారాలు అందించి వారికి అండగా ఉండటం నేనన్నారు. సమస్త ఎవరికి వ్యతిరేకం కాదని అందరి సహాయ సహకారాలు సలహాలు తీసుకొని రాష్ట్ర జిల్లా నియోజకవర్గ టౌన్ మండల కమిటీలు ఏర్పాటు చేసి ఆ దిశగా దళిత క్రైస్తవులు పాస్టర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ ముందుకు సాగుతామన్నారు. రావూరి పాల్ మాట్లాడుతూ దేవుని ఆశీర్వాదాలతో అందరం కలిసికట్టుగా ముందుకు తాగుతూ దేవుని సువార్తను ముందుకు తీసుకెళ్తూ సహోదరుల సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడిగా ముందుకు సాగుతూ పనిచేద్దాం అన్నారు. పాస్టర్లకు జీవిత బీమా, మేమున్నామనే భరోసా కల్పిస్తామన్నారు. సమావేశంలో పట్టణ కమిటీ గౌరవ అధ్యక్షులుగా పి జ్ఞానేశ్, పట్టణ కమిటీ ఉపాధ్యక్షులుగా ఆర్ దానియేలు, టౌన్ కార్యదర్శిగా రావూరి విక్టర్ పాల్, టౌన్ కోశాధికారిగా ఏ ఇస్రాయెల్, టౌన్ కమిటీ అధికార ప్రతినిధిగా ఎం లాజరస్, టౌన్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా సమాధానరావు, సహాయ కార్యదర్శిగా సి హెచ్ ఎబినేజర్, కార్యనిర్వ కార్యదర్శిగా కె జగదీష్ ఎన్నికయ్యారు. ప్రార్థన పూర్వకంగా జరిగిన ఆ సమావేశంలో సమస్త జిల్లా అధికార ప్రతినిధి చావాలి రాజేంద్రప్రసాద్ మరియు సభ్యులు పాల్గొన్నారు.

## తూర్పులో పింఛన్ల పంపిణీ



○ **ఎమ్మెల్యే నసీర్ ఆదేశాలకు లబ్ధిదారులకు అందించిన కూటమి నేతలు**

○ **పింఛన్లు పెంచిన ఘనత కూటమిదే..**

○ **నూతన పింఛన్లకూ అవకాశం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** సామాజిక పింఛన్లు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి నాయకులు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పింఛన్లు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. . రాష్ట్రంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ దారులకు మంచి రోజులు వచ్చాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్లు పెంచారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కసారిగా వెయ్యి రూపాయలు పింఛన్లు పెంచిన ఘనత తమకే దక్కుతుందని చెప్పారు. దీంతోపాటు వ్యాధిగ్రస్తులు, వికలాంగులకు సైతం పింఛన్లు పెంచామన్నారు. గతంలోనూ రూ. 200 నుంచి 2 వేల రూపాయలకు పింఛన్ పెంచిందీ తెలుగుదేశం పార్టీనేనని గుర్తు చేశారు. ఈ రోజున రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తున్నామని, సంక్షేమాన్ని ఇంటి వద్దకే తీసుకెళుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో 65 లక్షలకుపైగా పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నివర్గాల ప్రజలకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కేవలం పింఛన్ దారులకు మేలు చేయడమే కాకుండా రాష్ట్రంలో యువత భవితకు బంగారు బాటలు వేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## మెగా డీఎస్సీపై అసత్య ప్రచారాలు మానుకోవాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మెగా డీఎస్సీ నియామకాలపై బ్లూ మీడియా, వైసీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను వెంటనే నిలిపివేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నెం శివ నాగమల్లేశ్వరరావు (మల్లి), మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ సమావేశ మందిరంలో మెగా డీఎస్సీ లబ్ధిదారులు, నిరుద్యోగ జేఏసీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో నిర్లక్ష్యం జరిగిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు న్యాయం చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగాల కల్పన, జాబ్ క్యాలెండర్ అమలులో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ, టీచర్ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని విమర్శించారు. ముఖ్యమంత్రి చీ. జష్ట్రుఖఅనత్ఘుమ్ఘుఎబ చీఘుఱనబ అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ సిద్ధిక్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో నిరుద్యోగులను నిరాశపరిచారని, ఉద్యోగాల కోసం పోరాడిన వారిపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ, ఆర్ఎస్‌యూ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, డీఎస్సీ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గణిత భయాన్ని పోగొట్టడమే పరిశోధన లక్ష్యం : డాక్టరేట్ గ్రహీత మేరీ మౌనిక

○ **ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలపై అధ్యయనానికి పీహెచ్‌డీ**



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** గణిత ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలు, ప్రభావశీలతపై చేసిన పరిశోధనకు గాను మంగళగిరికి చెందిన పరిశోధకురాలు తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ఎస్ మేరీ మౌనిక అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తన విద్యా ప్రస్థానం, పరిశోధన విశేషాలను వివరించారు. తన ప్రాథమిక విద్య ఒంగోలులోని ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమైందని, అనంతరం ఏబీఎం హైస్కూల్‌లో పదో తరగతి, ఉమామహేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసినట్లు తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్స్, బీఈడీ, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ పూర్తి చేసి, ఎంఈడీలో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. 2015లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకున్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 2020లో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ స్కాలర్‌గా చేరి, ప్రొఫెసర్ డాక్టర్ సి. హెచ్. బేబీ ప్రసన్న పర్యవేక్షణలో "సెకండరీ స్థాయిలో గణిత ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలు మరియు ప్రభావశీలతపై అధ్యయనం" అనే అంశంపై పరిశోధన నిర్వహించి డాక్టరేట్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయాన్ని తగ్గించి, ఆసక్తిని పెంపొందించడంలో ఉపాధ్యాయుల నైపుణ్యాలు కీలకమని ఆమె పేర్కొన్నారు. సరైన బోధనా పద్ధతులు, సామర్థ్యాలు కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులను గణితంలో మెరుగైన ఫలితాలు సాధించేలా చేయగలరని తమ పరిశోధనలో తేలినట్లు వివరించారు. ఈ పరిశోధనకు విద్యావేత్తల నుంచి ప్రశంసలు లభించాయని, విద్యారంగానికి ఉపయోగపడే అంశాలను ప్రతిపాదించినందుకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు చెప్పారు. పీహెచ్‌డీ సాధనలో తన భర్త, తల్లిదండ్రులు, అత్తమామలు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు బుల్లా పూర్ణచంద్రరావు, వై. జగన్మోహన్‌రావు, బుల్లా రమేష్‌బాబు, బుల్లా పిచ్చయ్య పాల్గొని డాక్టరేట్ గ్రహీత మేరీ మౌనికను అభినందించారు. ఆమె చేసిన పరిశోధన గణిత బోధనలో విద్యార్థుల భయాన్ని తగ్గించి, అభ్యాసాన్ని మెరుగుపరచడంలో ఉపయుక్తంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. అలాగే విద్యారంగంలో మరిన్ని పరిశోధనలు చేపట్టి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.. కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులు, పాల్గొని ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## గోదావరి పరిరక్షణకు పవన్ కళ్యాణ్ చొరవతో వేగవంతమైన చర్యలు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల చేపట్టిన రాజమహేంద్రవరం పర్యటన రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు కొత్త దిశను చూపిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గోదావరి నదిలో పెరుగుతున్న కాలుష్యంపై పవన్ కళ్యాణ్ వ్యక్తం చేసిన ఆందోళనకు అనుగుణంగా కేవలం 24 గంటల్లోనే రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయి 'ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాబోయే 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పరిశ్రమల వ్యర్థాలు, మురుగునీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రారంభించామని వెల్లడించారు.
గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల పరిధిలో 262 పంచాయతీలను మురుగురహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. 'స్వచ్ఛ గోదావరి -- పవిత్ర పుష్కరాలు' లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, కాలుష్య నియంత్రణ మండలి కేటాయించిన రూ. 100 కోట్లతో పాటు ఇతర నిధులను వినియోగించి మురుగునీటి శుద్ధి, పారిశ్రామిక కాలుష్య నియంత్రణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అలాగే ఆర్టీజీఎస్ తరహాలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నదుల కాలుష్యాన్ని ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉంచనున్నట్లు వెల్లడించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి టాస్క్ ఫోర్స్ సమావేశమై క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తుందని, పర్యావరణ ప్రమాణాలను ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు, గ్రామీణ ప్రాంతాల్లో మురుగు నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గోదావరి పరిరక్షణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చూపిన చొరవ వల్ల దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగులు పడ్డాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



**కాకినాడ/విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు రాజ్యసభ సభ్యులు, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు సానా సతీష్ బాబు సోమవారం పెన్షన్లు పంపిణీ చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కార్పొరేషన్ పరిధిలో ఒకటవ డివిజన్ రమణయ్యపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్ అందజేసి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం సామాజిక భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పారదర్శకంగా అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. లబ్ధిదారుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పేరాపత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి -- సత్యనారాయణమూర్తి దంపతులు, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్ బాబా, సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, మేకా లక్ష్మణ్ మూర్తి, మాజీ కార్పొరేటర్ లోవబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు ప్రణాళికలు చేపట్టాలి: బీజేపీ జనతా వారధి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమంలో భాగంగా కన్వీనర్ షేక్ సాంబశివరావు సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2026 ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు వర్షపాతం పరిస్థితులపై హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం లేదా భారీ వర్షాల పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున పంటల ప్రణాళిక, నీటి నిర్వహణ, సాగు సన్నాహకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చెరువుల పునరుద్ధరణ, నీటి నిల్వ సామర్థ్యాల పెంపు, రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించడంతో పాటు వ్యవసాయ రంగానికి అనుకూల విధానాలు అమలు చేయాలని కోరారు. రైతులను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుంటూ, నిపుణుల అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరుతో పాటు కౌలు రైతులకు కూడా రుణ సదుపాయాలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు, కో-కన్వీనర్ కత్తి మేరీ సరోజిని, కార్యదర్శి సురేష్ జైన్, తూర్పు మండల అధ్యక్షుడు మల్లాల లక్ష్మణ్ గౌడ్, ఎస్‌జీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రహం, కారుణ్య అలీ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర చిరకాల ఆకాంక్ష నెరవేరింది : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

○ దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద కూటమి నాయకులు సంబరాలు



**విశాఖపట్నం, (జర్నలిస్ట్ ఫైల్):** దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమైన సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల ఆకాంక్ష సాకారమైన సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాల్లో పాల్గొన్నారు. బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచి ఆనందాన్ని వ్యక్తం చేశారు. రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులు సైతం ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు.
ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల నాలుగు దశాబ్దాల కల నేడు సాకారమైందన్నారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ప్రాంత అభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగానే ఈ చారిత్రక ఘట్టం సాధ్యమైందని అన్నారు.

**యువతకు కొత్త అవకాశాలు**

రైల్వే జోన్ ఏర్పాటుతో స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పల్లా తెలిపారు. రైల్వే నియామకాలు, పరిపాలనా వ్యవహారాలు స్థానిక స్థాయిలో మరింత సులభతరం అవుతాయని చెప్పారు. ఉత్తరాంధ్ర యువత భవిష్యత్తుకు ఇది బలమైన పునాది అవుతుందని అభిప్రాయపడ్డారు.

**పోర్టు ఆధారిత అభివృద్ధికి ఊతం**

విశాఖపట్నం, గంగవరం పోర్టులతో రైల్వే అనుసంధానం మరింత బలోపేతం కావడం ద్వారా సరకు రవాణా సామర్థ్యం పెరుగుతుందని పల్లా పేర్కొన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు, వాణిజ్య కార్యకలాపాలకు ఇది విశేష ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. రైల్వే జోన్ ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధికి కీలక కేంద్రంగా మారనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, గాజువాక బీజేపీ కన్వీనర్ నరసింగరావు, కూటమి నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రీ కాన్వొకేషన్ వేడుకలు

○ అవార్డు గ్రహీతలను అభినందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఎడాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ స్నాతకోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం రాత్రి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రీ కాన్వొకేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డు గ్రహీతలను సత్కరించి అభినందించారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న వైద్య విద్య, పరిశోధన సేవలను కొనియాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో విశ్వవిద్యాలయం గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ అవార్డు గ్రహీతలు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి. నరసింహన్, డాక్టర్ పి.సి. రాత్ పాల్గొన్నారు. వీరిని విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ సభికులకు పరిచయం చేశారు. వైద్య విద్యాభివృద్ధికి విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని అవార్డు గ్రహీతలు తమ ప్రసంగాల్లో ప్రశంసించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతులు సీవీ రావు, శ్యామ్ ప్రసాద్ సేవలను గుర్తు చేస్తూ మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ దుర్గాప్రసాద్, మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ అహంతం శాంతాసింగ్, ఏపీ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
మంగళవారం విజయవాడ లోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరగనున్న 29వ, 30వ స్నాతకోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించనున్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సి. నరసింహన్ హాజరుకానున్నారు. 2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన ఉత్తమ ప్రతిభ కనబరిచిన యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు 29వ స్నాతకోత్సవంలో 62 గోల్డ్ మెడల్స్, 21 సిల్వర్ మెడల్స్, 18 ఎండోమెంట్ బహుమతులు, 30వ స్నాతకోత్సవంలో 61 గోల్డ్ మెడల్స్, 18 సిల్వర్ మెడల్స్, 19 ఎండోమెంట్ బహుమతులు ప్రదానం చేయనున్నారు.

## ఎండీఎంఏ మత్తు పదార్థంతో నలుగురు యువకులు అరెస్ట్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మాదక ద్రవ్యాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా పాత గుంటూరు పోలీసులు ఎండీఎంఏ (మెత్) మత్తు పదార్థాన్ని వినియోగిస్తున్న నలుగురు యువకులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 18 గ్రాముల మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో పోలీసు శాఖ విస్తృత తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ '0' లైన్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద కొందరు యువకులు ఎండీఎంఏ మత్తు పదార్థాన్ని వినియోగిస్తున్నారనే సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.
దాడుల్లో నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న 18 గ్రాముల ఎండీఎంఏ (మెత్)ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు చెడు వ్యసనాలకు అలవాటు పడి, తమ అవసరాల కోసం బెంగళూరుకు చెందిన అర్జున్ అనే వ్యక్తి ద్వారా మత్తు పదార్థాన్ని ప్రైవేట్ బస్సు పార్శిల్ సేవ ద్వారా గుంటూరుకు తెప్పించుకున్నట్లు వెల్లడైంది.
ఈ సందర్భంగా ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయం, సరఫరా, వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఈగల్ (జూలా-+జాజు) బృందాలతో సమన్వయం చేసుకుంటూ నేరస్తులపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. మాదక ద్రవ్యాల కేసుల్లో తరచూ నిందితులుగా ఉన్న వారిపై పీడీ యాక్ట్‌తో పాటు పిట్-ఎన్‌డీపీఎస్ చట్టం కింద కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

○ నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) అమలుకు ముందే చట్టబద్ధంగా నియమితులైన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) అర్హత నుంచి మినహాయించేలా కేంద్ర ప్రభుత్వం ఆర్‌టీఈ చట్టంలోని సెక్షన్ 23(2)ను సవరించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. దశాబ్దాల బోధనా అనుభవం కలిగిన ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని కేవలం ఒక అర్హత పరీక్ష ఆధారంగా అంచనా వేయడం సముచితం కాదని సంఘం అభిప్రాయపడింది. ఇప్పటికే ప్రభుత్వ సేవల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు టెట్‌ను తప్పనిసరి చేయడం వల్ల వారి సేవా భద్రత, వృత్తిపరమైన హక్కులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఎన్‌టీఏ-ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు సంయుక్త ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23(2) ఆధారంగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా టెట్ అర్హత తప్పనిసరి అని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసిన నేపథ్యంలో, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం పార్లమెంట్ ద్వారా చట్ట సవరణలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి ఉపాధ్యాయుల ప్రయోజనాలను పరిరక్షించే చర్యలు చేపట్టాలని కోరారు.

## స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలి: ఆప్టా

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో వెంటనే భర్తీ చేయాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు తగిన ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఎంఎస్ నెం. 26 ద్వారా 1,124 కొత్త స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయగా, గతంలో ఉన్న 860 పోస్టులతో కలిపి మొత్తం 1,984 పోస్టులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అయితే వీటిలో గణనీయమైన సంఖ్యలో పోస్టులు ఇంకా ఖాళీగా ఉండటంతో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని పేర్కొన్నారు.
రాష్ట్రంలో ప్రస్తుతం స్పెషల్ బీఈడీ పూర్తి చేసి ఆర్‌సీఐ సర్టిఫికెట్ పొందిన సుమారు 500 మంది ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు ఉన్నారని, వీరికి 70:30 నిష్పత్తిలో పదోన్నతులు కల్పించి పోస్టులను భర్తీ చేయాలని ఆప్టా కోరింది. 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసింది.
ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పాఠశాల విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ, పాఠశాల విద్యా కమిషనర్‌లకు ఆప్టా తరఫున వినతిపత్రం సమర్పించినట్లు సంఘం నాయకులు తెలిపారు.

## ఘనంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు జన్మదిన వేడుకలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు జన్మదిన వేడుకలు సోమవారం నగరంలోని 18వ వార్డు సంపత్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి, గుంటూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారదాసు వీరమణీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని తిరుపతిరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రనం హరిబాబు, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ సురేష్, మాజీ కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, శ్రావణకుమారి, జాతీయ స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరు వెంకట సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ సీనియర్ నాయకులు నేరెళ్ల మాధవరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చెంగలశెట్టి సత్యనారాయణ, మాజీ జనసేన జిల్లా అధ్యక్షుడు మాదారాధా కృష్ణమూర్తి, జనసేన నాయకుడు ఆళ్లహరి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భజరంగ్ రామకృష్ణ, దారా అంబేద్కర్ తదితరులు హాజరయ్యారు.
కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ చెరుకూరి తిరుపతిరావు పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

## ఎన్‌టీఆర్ భరోసా యాప్‌లో సాంకేతిక సమస్యలు.. ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయవద్దు

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** జూన్ నెల ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ సందర్భంగా మొబైల్ యాప్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు, స్వర్ణ గ్రామ-వార్డు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ జాని పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు తెలిపారు. యాప్‌లో ఏర్పడిన లోపాలు ఉద్యోగుల నియంత్రణలో లేని అంశమని, అయినప్పటికీ పింఛన్ పంపిణీ అనంతరం ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా సేకరించే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఉద్యోగులపై పరోక్షంగా బాధ్యత మోపడం సరికాదని పేర్కొన్నారు. గతంలో కూడా కొన్ని జిల్లాల్లో ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఉద్యోగులను హెచ్చరించడం, మానసిక ఒత్తిడికి గురిచేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో గ్రామ, వార్డు ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తున్నారని, సాంకేతిక లోపాల బాధ్యతను వారి పనితీరుతో ముడిపెట్టడం సరైన విధానం కాదని ఫెడరేషన్ అభిప్రాయపడింది. పింఛన్ పంపిణీ సమయంలో తలెత్తిన సాంకేతిక సమస్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించి వాటిని పరిష్కరించడంతో పాటు, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ప్రక్రియ కారణంగా ఉద్యోగులకు ఎటువంటి ప్రతికూల ప్రభావాలు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## అవ్వాతాతలతో మమేకమైన కలెక్టర్.. జిల్లావ్యాప్తంగా ఎన్‌టీఆర్ భరోసా పంపిణీ



○ గడప వద్దకే భరోసా.. 2.53 లక్షల మందికి రూ.110 కోట్ల పింఛన్లు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ సోమవారం మంగళగిరిలో ప్రారంభించి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమైన కలెక్టర్ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు సకాలంలో అందుతున్నాయా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అమలవుతున్నాయి, సిబ్బంది ప్రవర్తన ఎలా ఉందనే అంశాలపై లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,53,379 మంది పింఛనుదారులకు రూ. 110.50 కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వృద్ధాప్య పింఛన్లు 1,13,860, వితంతు పింఛన్లు 71,608, దివ్యాంగుల పింఛన్లు 24,493, ఒంటరి మహిళల పింఛన్లు 11,265తో పాటు వివిధ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నట్లు చెప్పారు.
ప్రభుత్వం ఎన్‌టీఆర్ భరోసా పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, లబ్ధిదారులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీం భాషా, అదనపు కమిషనర్ శకుంతల, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ కార్యక్రమాల విజయవంతానికి సమిష్టిగా కృషి చేయాలి

○ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన సోమవారం జిల్లా కార్యాలయం వాజపేయి భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, తణుకు మున్సిపల్ చైర్‌పర్సన్ ముళ్లపూడి రేణుక ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో జూన్ నెలలో పార్టీ చేపట్టనున్న ప్రధాన కార్యక్రమాలపై చర్చించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'తల్లి పేరుతో ఒక మొక్క', జూన్ 10 నుంచి 14 వరకు ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హాల్ మీటింగ్‌లు, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల నిర్వహణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.
జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త ఈ మూడు కార్యక్రమాలను విజయవంతం చేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ముళ్లపూడి రేణుక మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గత 12 సంవత్సరాల్లో దేశం సాధించిన పురోగతిని వివరించాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వ్యవసాయంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పండ్ల మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని అన్నారు.
స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కేవీ సుబ్బారావు మాట్లాడుతూ పార్టీ బూత్ స్థాయిలో బలోపేతం కావాలంటే ప్రతి కార్యకర్త అంకితభావంతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ శివ మకుటం, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తడువాయి రామకృష్ణ, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణతో పాటు జిల్లా పదాధికారులు, మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467